## విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ,
పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

TELTEL/2012/47103

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 12 సంచిక :78 నల్గొండ మంగళవారం 10-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-


## సోనమ్‌కు వివాహేతర సంబంధం..సుపారీ ఇచ్చి భర్త హత్యకు ప్లాన్



ఇండోర్,జూన్9: మేఘాలయా మర్డర్ కేసులో కొత్త కోణం బయటకు వచ్చింది. ఇండోర్‌కు చెందిన కొత్త జంట .. హనీమూన్‌కు వెళ్లి గల్లంతయన విషయం తెలిసిందే. భర్త రాజా రఘువంశీనీ .. భార్యే హత్య చేయించినట్లు మేఘాలయా పోలీసులు చెబుతున్నారు. సోనమ్‌కు వివాహేతర సంబంధం ఉందని, దాని వల్ల ఆమె కాంట్రాక్టు హంతకులతో భర్తను హత్య చేయించి ఉంటుందని మేఘాలయా పోలీసులు పేర్కొన్నారు. రఘువంశీ, సోనమ్‌లు మే 23వ తేదీన చిరంపుంజి వద్ద మిస్సైయ్యారు. వారం రోజుల తర్వాత రాజా మృతదేహాన్ని ఓ లోయలో గుర్తించారు. కానీ సోనమ్ కోసం వేట కొనసాగింది. వారం తర్వాత ఆమె తన స్వంత ఊరిలో ప్రత్యక్షమైంది. రాజా రఘువంశీ మర్డర్‌కు వివాహేతర సంబంధమే కారణమని మేఘాలయా పోలీసులు నమ్ముతున్నారు. బాయ్‌ఫ్రెండ్ రాజ్ కుశ్వాతో కలిసి భర్త మర్డర్‌కు ఆమె ఎ÷-లాన్ చేసిందన్నారు. కానీ కేసు వత్తిడి వల్ల జూన్ 8వ తేదీన వాళ్లు సరెండర్ అయినట్లు- పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో సోనమ్ భాయ్‌ఫ్రెండ్ రాజ్ కుష్వా గురించి బాధిత కుటు-ంబీకులు మౌనం వీడారు. సోనమ్ వద్ద రాజ్ పనిచేసేవాడని, వాళ్లు ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడుకునేవాళ్లు అని రఘువంశీ సోదరుడు విపుల్ పేర్కొన్నారు. కానీ రాజ్ కుష్వాను ఎప్పుడూ చూడలేదని, కేవలం అతని గురించి విన్నట్లు- విపుల్ తెలిపాడు. బహుశా రఘువంశీ మర్డర్ కేసులో సోనమ్ పాత్ర ఉండి ఉంటు-ందని విపుల్ తెలిపారు. కొత్త జంట ముందుగా గౌహతిలోని కామాఖ్యా ఆలయానికి వెళ్లాలని ఎ÷-లాన్ చేశారు. కానీ ఎ÷-లాన్‌ను మార్చుకుని ఎందుకు మేఘాలయా వెళ్లారో తెలియదని విపుల్ తెలిపాడు. హనీమూన్‌కు వెళ్లిన జంట అదృశ్యమైనా.. సోనమ్ ఎలా బ్రతికి ఉందన్న దానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మే 11వ తేదీన రాజా, సోనమ్‌లు పెళ్లి చేసుకున్నారు. మే 20వ తేదీన వాళ్లు హనీమూన్‌కు వెళ్లారు. ఆ తర్వాత రోజు వాళ్లు షిల్లాంగ్‌లో కనిపించారు. మే 23వ తేదీన పాపులర్ పిక్నిక్ స్పాట్‌కు వెళ్లారు. జూన్ రెండో తేదీన రఘువంశీ మృతదేహాన్ని గుర్తించారు. అక్కడ ఓ మచ్చుకత్తి దొరికింది. కానీ జూన్ 8వ తేదీ వరకు సోనమ్ ఆచూకీ చిక్కలేదు. చివరకు యూపీలో ఓ దాబా వద్ద ఆమెను పట్టుకున్నారు.

## ప్రతీ ఇంటికి సరిపడా నీరందిస్తాం : బండి సంజయ్



చొప్పదండి, ప్రతీ ఇంటికి.. ప్రతీ వ్యక్తికి సరిపడా నీరందించే దిశగా అమృత్-2 పథకాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని నల్లాల బావి వద్ద రూ.36.3కోట్ల వ్యయంతో వాటర్ ఇంప్రూవ్ మెంట్ స్కీంకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ%% చొప్పదండి మున్సిపాలిటీలో ప్రతి ఒక్కరికీ సరిపడా నీళ్లను అందించాలనే లక్ష్యంతో అమృత్ 2 పథకం కింద 36కోట్ల 30లక్షల రూపాయల నిధులతో పైప్ లైన్, వాటర్ సంప్ ఇతర పనులను చేపట్టేందుకు పనులను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 2015 జూన్ 25న ప్రారంభమైన అమృత్ 1 పథకం కింద 2015-16 నుండి 2019-20 వరకు కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద ఖర్చు 50 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. అమృత్ స్కీం ద్వారా దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 1 కోటి 34 లక్షల నీటి కనెక్షన్లు అందించామన్నారు. 1 కోటి 2 లక్షల మురుగునీటి కనెక్షన్లు అందించామన్నారు. వీటితో పాటు 2 వేల 411 పార్కులను అభివృద్ధి చేశామని, 62 లక్షల 78 వేల ఎల్ఈడీ లైట్లను అమర్చామన్నారు.2021లో అమృత్ 2.0 పథకం ప్రారంభమై ఐదేళ్ల పాటు ఈ పథకం అమలులో ఉ ంటుందన్నారు. ఈ స్కీం కింద కేంద్ర, రాష్ట్రాలు, మున్సిపాలిటీల భాగస్వామ్యంతో ఈసారి 2 లక్షల 99 వేల కోట్ల రూపాయల ఖర్చు చేయాలని మోదీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందులో కేంద్ర వాటా కింద 76 వేల 760 కోట్ల రూపాయలను కేటాయించబోతున్నామని, మిగిలిన మొత్తాన్ని ఆయా రాష్ట్రాలు, నగర పాలక సంస్థలు సమీకరించుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో అమృత్ 1, అమృత్ 2.0 కింద మొత్తం 6 వేల 876 కోట్లు ఖర్చు చేయబోతున్నామని, కేంద్ర వాటా 3 వేల 591 కోట్ల 72 లక్షల రూపాయలు ఉండగా, రాష్ట్ర వాటా కింద 2 వేల 614 కోట్ల 82 లక్షల రూపాయలు ఉందన్నారు. ఎంపిక చేయబడిన మున్సిపాలిటీల వాటా 669 కోట్ల 85లక్షల రూపాయలు ఉండగా, అమృత్ 1 కింద 1153 కోట్లు, అమృత్ 2 కింద 2438 కోట్ల రూపాయలను మోదీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా విషయానికొస్తే అమృత్ 1, అమృత్ 2 కింద మొత్తం 852 కోట్ల 11 లక్షల రూపాయలు కేటాయించామన్నారు.ఇందులో కేంద్ర వాటా 481 కోట్ల 19 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా 297 కోట్ల 55 లక్షలు, మున్సిపాలిటీల వాటా 73 కోట్ల 37 లక్షలుగా ఉ ందన్నారు. చొప్పదండి మున్సిపాలిటీలో అమృత్ 2 కింద 36 కోట్ల 30 లక్షల రూపాయల నిధులతో ఇంటింటికీ నీళ్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో కేంద్ర ప్రభుత్వం 17 కోట్ల 89 లక్షలు, రాష్ట్రం వాటా 15 కోట్ల 11 లక్షలు, మున్సిపాలిటీ వాటా 3 కోట్ల 30 లక్షలు ఉందన్నారు. దేశంలో 40 శాతం జనాభా పట్టణాల్లోనే నివసిస్తోందని, 2047 నాటికి ఈ సంఖ్య 50 శాతం కంటే ఎక్కువ కాబోతోందన్నారు. ప్రధాని మోదీ ఎంతో దూరదృష్టితో నగరాలు, పట్టణాల్లో నివసించే ప్రతి ఇంటికీ సరిపడా నీటిని అందించంతోపాటు డ్రైనేజీ సౌకర్యం కల్పించి నీటి భద్రతా నగరాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అమృత్ పథకాన్ని ప్రారంభించిందన్నారు.చొప్పదండిలో ఎప్పుడో ఈ స్కీంను మొదలు పెట్టాల్సి ఉన్నా గత ప్రభుత్వం సం వాకరించక పోవడం వల్ల నిలిచి పోయిందన్నారు. అన్ని అడ్డంకులను అధిగమించి పథకం పనులకు శ్రీకారం చుట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ పనులను పూర్తి చేసి చొప్పదండి ప్రజలకు ఇంటింటికీ సరిపడా నీళ్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీంతోపాటు సీఆర్ఎఫ్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్లను నిర్మిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కేసీఆర్ పాలనలో సంక్షేమానికి పెద్దపీట

నిజామాబాద్,జూన్9: బిఆర్ఎస్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం అని మాజీమంత్రివేము ప్రశాంతరెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమం జోడుగుర్రాల్లా పరుగులు తీసాయని అన్నారు. తెలంగాణ పథకాలు దేశవ్యాప్తంగా అమలయి ఉంటే ఇవాళ దేశం దశ మారేదన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇప్పుడు అన్నీ పోయాయని, మళ్లీ పాతరోజులు వచ్చాయని మండిపడ్డారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి సురక్షిత మంచి నీళ్లు వచ్చేలా చేశామని, దానిని కూడా సక్రమంగా ముందుకు తీసుకుని వెల్లడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం అయ్యిందని అన్నారు.కేసీఆర్ పాలనలో వృద్ధులు, వికలాంగులకు ఆత్మగౌరవం పెంచారని తెలిపారు. గాంధీ భవన్‌లో కూర్చుంటే కాంగ్రెస్ వాళ్లకు అర్థంకాదని, ఊర్లోకి వచ్చి అవ్వ, తాతలను అడిగితే తెలుస్తుందన్నారు. బీడీ కార్మికులకు ఏ రాష్ట్రంలోనైనా పెన్షన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. కేసీఆర్ సంపద పెంచి పేదలకు పంచారని చెప్పారు. పెద్ద కొడుకులా వృద్ధులకు పెన్షన్లు అందించారని చెప్పారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింట్లో వెలుగులు నిండాయన్నారు. అన్ని కులాలకు సంక్షేమ భవనాలు నిర్మించారని చెప్పారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం పోటీ ఏర్పడిందన్నారు. కెసిఆర్ తొమ్మిదేండ్లలో 21 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని తెలిపారు. వైద్య కళాశాలలు తెచ్చామని



బీజేపీ నాయకులు అబద్దాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ నాయకుల తీరు సొమ్ము ఒకడిది.. సోకు మరొకడిది అన్నట్లు ఉందని విమర్శించారు. బండి సంజయ్ కరీంనగర్‌కు మెడికల్ కాలేజీ తెచ్చాడా అని ప్రశ్నించారు. అబద్దాల బీజేపీ నాయకులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే విభజన హామీలను అమలు చేయాలన్నారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టాలని వెల్లడించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులవి నరం లేని నాలుకలని విమర్శించారు.

## పాక్‌కు నీటి కష్టాలు.. భారత్ దెబ్బకి ఎండిపోతున్న పంటలు




న్యూఢిల్లీ, పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకోవడంతో దాయాది దేశానికి నీటి కష్టాలు మొదలయ్యాయి.జలాశయాల్లో నీటిమట్టం పడిపోవడంతో.. సింధు బేసిన్‌లో నీటి ప్రవాహం 15 శాతం మేర తగ్గిపోయింది. వేసవిలో పంటలు ఎండి కష్టాల్లో పడిన రైతులకు ఖరీఫ్‌లో మరిన్ని కష్టాలు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు. పంజాబ్ ప్రావిన్సులో ప్రస్తుతం నీటి విడుదల 1.24 లక్షల క్యూసెక్కులకు తగ్గిపోగా.. తాజా గణాంకాల ప్రకారం పాకిస్తాన్ ఖైబర్ పఖ్తుంఖ్వాలోని టార్బెలా ఆనకట్ట దగ్గర సింధూ నది నీటి మట్టం 1,465 మీటర్లకు పడిపోయింది.. కనిష్ఠ స్థాయి నీటిమట్టం 1,402 మీటర్లు ఉంది.అయితే, పంజాబ్‌లోని చస్మా ఆనకట్ట వద్ద ప్రస్తుత నీటిమట్టం 644 మీటర్లుగా ఉందని పాక్ అధకారులు తెలిపారు. ఇక్కడ డెడ్ స్టోరేజీ స్థాయి 638 మీటర్లకు చేరినట్లు తెలుస్తుంది. ఇక, సియాల్‌కోట్‌లో మరాలా దగ్గర పరిస్థితి మరీ తీవ్రంగా ఉంది.. చీనాబ్‌పై సగటు నీటి విడుదల మే 28వ తేదీ నాటికి 26,645 వేల క్యూసెక్కులు ఉంటే జూన్ 5వ తేదీ నాటికి 3,064 క్యూసెక్కులకు పడిపోయింది. ఈ నీటి ఎద్దడితో పాక్‌లోని పంజాబ్‌లో ఖరీఫ్ పంటలు ఇప్పుడు కష్టాల్లో పడ్డాయి. భారత్ నిర్ణయంతో 21 శాతం నీటి కొరత ఏర్పడుతుందని ఇప్పటికే పాక్ అంచనా వేసింది. టెర్రరిజంపై పాక్ తీరు మారే వరకూ ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

## కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధార...



హైదరాబాద్ : కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధార.. ఈ విషయం తెలంగాణ ప్రజలకు అర్థమైంది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఏదీ నోటి మాటగా చెప్పలేదు. అన్నీ సాక్ష్యాధారాలతో సహా సమర్పించడం జరిగిందని స్పష్టం చేశారు. క్యాబినెట్ నిర్ణయాలు, వాప్కోస్ రిపోర్టులు, సీడబ్ల్యూసీ లేఖలు అన్నీ సమర్పించడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన అనంతరం బీఆర్కే భవన్ వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.ఈ రోజు కాళేశ్వరం కమిషన్ విచారణలో భాగంగా పిలవడం జరిగింది. కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పడం జరిగింది. ఆధారాలతో సమాధానాలను కమిషన్‌కు అందించడం జరిగింది. కమిషన్ విచారణకు హాజరై రాజకీయాలు మాట్లాడటం సరికాదు. రాజకీయాలు ఏమైనా ఉంటే రేపు మాట్లాడుకుందాం. లోపట ఒకటి చెప్పి బయట ఒకటి చెప్పడం తప్పు అవుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

### తమ్మిడిహట్టిపైనే చాలాసేపు డిస్కషన్

మొట్టమొదలు తమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు బ్యారేజ్‌ను ఎందుకు మార్చారు అనేదానిపై చాలాసేపు డిస్కషన్ జరిగింది. దానికి నేను కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం తమ్మిడిహట్టి దగ్గరే ప్రాజెక్టు కట్టడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశాం. ఇరిగేషన్ మంత్రిగా రివ్యూ చేసినప్పుడు ప్రాణహిత ప్రాజెక్టు 7 ప్యాకేజీలు 27 భాగాలుగా టెండర్లను పిలిచింది గత కాంగ్రెస్ ప్రభుత్వం. తల పనులు స్టార్ట్ చేయకుండా తోక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తవ్వింది అని హరీశ్‌రావు తెలిపారు.

### 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పుకోమని చెప్పారు..

మహారాష్ట్ర కాంగ్రెస్ ఇరిగేషన్ మంత్రి హసన్ ముష్రఫ్‌ను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన నెలకే వెళ్లి కలవడం జరిగింది. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇవ్వండని అప్పటి మహారాష్ట్ర కాంగ్రెస్ మంత్రి హసన్ ముష్రఫ్‌ను కోరడం జరిగింది. ఇరిగేషన్ మంత్రిగా ఉన్నటువంటి హసన్ ముష్రఫ్.. చాలా రోజులుగా ముంపు గ్రామాల ప్రజలు మా ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మేము ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చౌహాన్ అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిరికి ఈ ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తులో నిర్మించడానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారని చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని కూడా కమిషన్ దృష్టికి తీసుకు వెళ్ళామని హరీశ్‌రావు తెలిపారు.

### తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ఐదారు మీటింగ్స్

మహారాష్ట్ర, తెలంగాణ మధ్య తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ఐదారు మీటింగ్స్ జరిగాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం పోయి బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీటిపారుదల శాఖ మంత్రిని కలిసి మళ్లీ తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని, తెలంగాణకు నీటి అవసరం ఉందని కోరడం జరిగింది. స్వయంగా కేసీఆర్ మహారాష్ట్రకు వెళ్లి అప్పటి గవర్నర్ విద్యాసాగర్ సమక్షంలో బిజెపి ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను కలిశారు. ఏడేండ్లు మాకంటే ముందు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపి పార్టీ తరఫున ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకిస్తూ అనేక పోరాటాలు చేసింది తానేనని ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు పర్మిషన్ ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వలేమని ఫడ్నవీస్ తేల్చి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం కేంద్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఏడు సంవత్సరాలు అధికారంలో ఉంటే ఒక్క అనుమతి కూడా సాధించలేదు. ఒక్క అంతర్ రాష్ట్ర ఒప్పందం చేసుకోలేదు. ఒక గుంట భూమిని కూడా సేకరించలేదు. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తెలంగాణ ప్రాంతం నుంచి మంత్రులుగా ఉన్న కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి పట్టించుకోలేదు. సెంట్రల్ వాటర్ కమిషన్ తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదు అని ప్రాజెక్టు నిర్మాణానికి ప్రత్యామ్నాయం చూసుకోవాలని లేఖ రాసింది. అదేవిధంగా CWC తమ్మిడిహట్టి ప్రాజెక్టులో ప్రతిపాదించిన రిజర్వాయర్ల సామర్థ్యం కూడా సరిపోదని సామర్థ్యానికి సరిపోయే రిజర్వాయర్లను పెంచుకోవాలని ఉత్తరం రాసింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్‌ని బ్యారేజ్ నిర్మాణ స్థల ఎంపిక చేయాలని కేసీఆర్ కోరడం జరిగింది. కేంద్ర సంస్థ వాప్కోస్ లాడార్ సర్వే చేసి, ఎగ్జామిన్ చేసి మేడిగడ్డ వద్ద నీటి లభ్యత ఉంది అక్కడ ప్రాజెక్టు నిర్మాణం చేసుకోవచ్చని తెలిపింది. వాప్కోస్, సెంట్రల్ వాటర్ కమిషన్, ఇంజనీర్ల సూచన మేరకు మేడిగడ్డ వద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది అని హరీశ్‌రావు తెలిపారు.


## మల్‌రెడ్డి రంగారెడ్డికి కొనసాగుతున్న బుజ్జగింపుల పర్వం..

తుర్కయంజాల్, జూన్ 9 : మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కడం అసంతృప్తిగా ఉన్న ఇబ్రహీం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని సోమవారం శ్రీధర్ బాబు తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధి తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపుతో కలిసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. గడిచిన పది సంవత్సరాలు పార్టీ అధికారంలో లేకున్నా పార్టీ కార్యకర్తలు, పార్టీని కాపాడిన నేత మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. మల్రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు అని ఆయన ఆవేదనను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఇతర పార్టీ పెద్దలు మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి మాట్లాడారని అన్నారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహానికి గురి కాకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు అభివృద్ధి సంస్థ



కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు.

## ఆ కామెంట్లు కిరాతకం: వెంకయ్య నాయుడు



హైదరాబాద్,ఏపీ రాజధాని అమరావతిలో ఆ తరహా మహిళలు ఉంటారంటూ.. వైసీపీ అధికారిక మీడియా సాక్షిలో ఓ వ్యాఖ్యాత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇది జరిగి నాలుగు రోజులు అయినా.. అధికారికంగా మాజీ సీఎం జగన్ కానీ, ఆయన సతీమణి, సాక్షి ఛానెల్ చైర్మన్ హోదాలో ఉన్న భారతి కానీ.. స్పందించకపోవడంతో ఇది మరింత వివాదంగా మారుతోంది. తాజాగా ఈ వ్యవహారంపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు స్పందించారు.రాజధాని అమరావతిపై చేసిన కామెంట్లను ఆయన కిరాతకమైనవిగా అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలను ఎవరూ సమర్థించలేరని.. అసలు ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని కూడా ఆయన విస్మయం వ్యక్తం చేశారు. అనేక మంది రైతులు.. రాజధాని అమరావతి కోసం తమ కన్నబిడ్డల్లాంటి భూములను త్యాగం చేశారని.. ఒక్క ఎకరం భూమి ఉన్న రైతులు కూడా.. రాష్ట్ర ప్రజల కోసం భూములు ఇచ్చారని.. అలాంటి రాజధానిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు.ఇలాంటి వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గం, హేయం, జుగుప్సాకరం అని వెంకయ్యనాయుడు అన్నారు. అమరావతి ప్రాంతంలో ప్రజలు వ్యవసాయమే వృత్తిగా ప్రవృత్తిగా జీవిస్తున్నారని.. వారు ఎంతో గౌరవంగా జీవిస్తూ.. సమాజానికి తిండి పెడుతున్నారని అన్నారు.

## సంపాదకీయం

మంగళవారం 10-06-2025

# చేతిలోని పావుకు చైనా అభయం

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టడంతో పాటు పాకిస్థాన్‌తో కుదిరిన సింధు జలాల పంపిణీ ఒప్పందాన్నీ నిలిపేసింది. దాంతో చైనా తన అనుంగు దోస్తు పాకిస్థాన్‌కు అండగా వచ్చింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టడంతో పాటు పాకిస్థాన్‌తో కుదిరిన సింధు జలాల పంపిణీ ఒప్పందాన్నీ నిలిపేసింది. దాంతో చైనా తన అనుంగు దోస్తు పాకిస్థాన్‌కు అండగా వచ్చింది. ఖైబర్ పఖ్తూన్‌క్వా రాష్ట్రంలో మొహ్మాండ్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేస్తానంటూ ఇస్లామాబాద్‌కు భరోసా ఇచ్చింది. దక్షిణాసియా జల వ్యవహారాల్లో చైనా జోక్యం అంతకంతకు పెచ్చుమీరుతోంది. పహల్గాం ఉగ్రదాడి క్రమంలో సింధు జల ఒప్పందం అమలును నిలిపేస్తున్నట్లు భారత్ ప్రకటించడంతో పాకిస్థాన్ గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. అప్పటికే ఆపరేషన్ సిందూర్‌తో దాయాది దేశం తీవ్రంగా దెబ్బతింది. ఇలాంటి తరుణంలో ఖైబర్ పఖ్తూన్‌క్వా రాష్ట్రంలోని మొహ్మాండ్ జలవిద్యుత్ ప్రాజెక్టును వేగిరమే నిర్మిస్తానంటూ పాక్‌కు బీజింగ్ అభయమిచ్చింది. డ్యామ్ కాంక్రీట్ ఫిల్లింగ్ పనులు మొదలయ్యాయనీ, ఇది ప్రాజెక్టు నిర్మాణంలో ముఖ్యమైన మైలురాయి అనీ చైనా అధికార వార్తాసంస్థ సీసీటీవీ ఇటీవల వెల్లడించింది. డ్రాగన్ ఇప్పటికే బ్రహ్మపుత్రపై భారీ డ్యామ్ ప్రతిపాదనతో ముందుకెళ్తోంది.

### భారత్‌కు హెచ్చరిక సందేశం?

ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్-పాకిస్థాన్‌ల మధ్య 1960లో సింధు జలాల పంపిణీ ఒప్పందం(ఐడబ్ల్యూటీ) కుదిరింది. దాని ప్రకారం, భారత్ తూర్పువైపు ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్ నదుల జలాలను వాడుకుంటుంది. పడమర దిశగా పారే సింధు, జీలం, చినాబ్ నదీ జలాలపై పాకిస్థాన్‌కు హక్కు ఉంటుంది. పాక్ మద్దతు కలిగిన ఉగ్రవాదులు పహల్గాంలో పర్యాటకులను ఘోరంగా హతమార్చడంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. నెత్తురూ నీరూ కలిసి ప్రవహించలేవని ఆయన హెచ్చరించారు. ఉగ్రవాదులకు పాక్ మద్దతు నిలిపేస్తేనే ఐడబ్ల్యూటీ అమలవుతుందనీ, అప్పటిదాకా ఒప్పందం అమలును నిలిపేస్తున్నామనీ ఆయన ప్రకటించారు. దీనివల్ల పడమర దిశగా పాకిస్థాన్‌లో పారే సింధు, దాని ఉపనదుల మీద భారత్ జలవిద్యుత్ కేంద్రాలను వేగంగా పూర్తిచేయగలుగుతుంది. ప్రస్తుతం నిర్మితమవుతున్న కిషన్ గంగ, రాట్లే ప్రాజెక్టులను పరిశీలించే హక్కు ఇకపై పాకిస్థాన్‌కు ఉండదు. ఐడబ్ల్యూటీ నిలిపివేత వల్ల పాక్‌లో నీటి సరఫరాకు ఇప్పటికిప్పుడు పెద్ద ముప్పేమీ ఉండదు. కానీ, సింధు మీద భారత్ నిర్మిస్తున్న ప్రాజెక్టులు పూర్తయ్యాక పాకిస్థాన్‌కు నీటి సరఫరా దెబ్బతింటుంది. అక్కడి వ్యవసాయానికి, జలవిద్యుదుత్పత్తికి ఇబ్బందులు తప్పవు. ఇటువంటి తరుణంలో మొహ్మాండ్ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేస్తానంటూ చైనా ముందుకురావడం భారత్‌కు హెచ్చరిక సంకేతం, పాక్‌కు భరోసానిచ్చే నిర్ణయం. ఖైబర్ పఖ్తూన్‌క్వా రాష్ట్రంలో పెషావర్‌కు ఉత్తరాన స్వాత్ నదిపై మొహ్మాండ్ డ్యామ్‌ను నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే 800 మెగావాట్ల జలవిద్యుచ్ఛక్తితో పాటు 16,100 ఎకరాలకు సాగునీరు అందుతుంది. వరద ముంపునూ నివారిస్తుంది. ఇలా మూడు రకాలుగా ఇస్లామాబాద్‌కు ఎంతో ఆర్థిక లాభం చేకూరుతుంది. 2010 జులైలో స్వాత్ నదికి వరదలు వచ్చి దిగువ జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లింది. దీనిపై పాక్ సుప్రీంకోర్టు ఒక విచారణ సంఘాన్ని నియమించింది. మొహ్మాండ్ డ్యామ్ కనుక పూర్తయ్యి ఉంటే నౌషేరా, చార్ సద్దా, పెషావర్ జిల్లాల్లో వరద నష్టాన్ని నివారించగలిగేవాళ్లమని ఆ కమిటీ సుప్రీంకు నివేదించింది.

### దక్షిణాసియా రాజకీయాలపై ప్రభావం

మొహ్మాండ్ డ్యామ్ నిర్మాణం 2019లో మొదలైంది. చైనా గెజూబా గ్రూపు కంపెనీ, పాకిస్థాన్ డెస్కాన్ ఇంజినీరింగ్ సంస్థలు దీన్ని నిర్మిస్తున్నాయి. డ్యామ్‌కు టర్బైన్ జనరేటర్ యూనిట్లనూ, ఆన్‌లైన్ మానిటరింగ్ సిస్టమ్‌నూ మరో చైనా కంపెనీ నిర్మిస్తోంది. ప్రాజెక్టు వ్యయం పాక్ రూపాయల్లో 30,900 కోట్ల పైమాటే. ఇస్లామిక్ డెవలప్‌మెంట్ బ్యాంకు 18 కోట్ల డాలర్ల నిధులను అందిస్తోంది. ఈ ప్రాజెక్టు ఆరు వేలకుపైగా ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. 2025 డిసెంబరులో పూర్తికావాల్సిన మొహ్మాండ్ డ్యామ్‌లో మొదటి యూనిట్ 2026 డిసెంబరులో ప్రారంభమవుతుంది. 2027 ఏప్రిల్‌లో మొత్తం ప్రాజెక్టు పూర్తవుతుందని అంచనా. మొహ్మాండ్‌తో పాటు పాక్‌లోని ఇతర ప్రాజెక్టుల్లోనూ చైనా హస్తముంది. ఈ రెండు దేశాలూ కలిసి ప్రపంచంలోనే అతిపెద్ద సంఖ్యలో డ్యాములు కడుతున్నాయని మనోహర్ పారీకర్ రక్షణ అధ్యయన సంస్థకు చెందిన ఉత్తమ్ కుమార్ సిన్హా వివరించారు. దక్షిణాసియాలో భారత్, చైనాల జలదౌత్య క్రీడ ఇకముందూ కొనసాగుతుందని లండన్‌లోని కింగ్స్ కాలేజ్‌కు చెందిన హర్ష్ వి.పంత్ విశ్లేషించారు. ఈ క్రీడలో పాకిస్థాన్ ఒక పావు మాత్రమేనన్నారు. మొహ్మాండ్ డ్యామ్‌పై చైనా నిర్ణయం దక్షిణాసియా రాజకీయాలపై తీవ్ర ప్రభావమే చూపించవచ్చు. ఏదిఏమైనా సైనిక వ్యూహపరంగా భారత్‌కు పోటీగా పాకిస్థాన్‌ను నిలపడమే చైనా ధ్యేయంగా కనిపిస్తోంది.

# ఎన్నికలబాట పట్టిన బంగ్లాదేశ్...

ఢాకా,బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహ్మద్ యూనస్ ఎట్టకేలకు సాధారణ ఎన్నికల నిర్వహణకు ముందుకు రావడం ముదావహం. ఇదిగో అదిగో అంటూ దిక్కుమాలిన సాకులు చూపి, ఎన్నికల నిర్వహణను నెలల తరబడి వాయిదా వేస్తూ వచ్చిన యూనస్ చివరకు అటు ప్రజాస్వామ్యవాదులు, ఇటు సైన్యం ఒత్తిడికి తలవంచక తప్పలేదు. వచ్చే ఏడాది ఏప్రిల్ ప్రథమార్థంలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహిస్తామంటూనే గతంలో ఎన్నికలు పక్షపాతపూరితంగా జరిగాయని గత ప్రభుత్వాధినేత షేక్ హసీనాపై అక్కసు వెళ్లగక్కారు. బంగ్లాదేశ్ ప్రస్తుత సంక్షోభానికి గతంలో జరిగిన పక్షపాతపూరిత ఎన్నికలే కారణమని, తన ప్రభుత్వం మాత్రం స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. తన తప్పిదాలు కప్పిపుచ్చుకునేందుకు వైరి పక్షంపై నిందలు మోపుతున్న యూనస్, ఎన్నికల నిర్వహణకు 20 నెలల సుదీర్ఘ సమయం దేనికి తీసుకుంటున్నారన్న ప్రశ్నకు ఏం సమాధానం చెబుతారు? ఎటువంటి పాలనానుభవం లేని ఈ పెద్దమనిషికి కుటిల రాజకీయ పరిజ్ఞానం మాత్రం పుష్కలంగానే ఉన్నట్లు గత పదినెలల ఆయన పాలన చెప్పకనే చెబుతోంది. వెల్లువెత్తిన ప్రజానిరసనల ధాటికి తట్టుకోలేక గత ఏడాది జూన్‌లో అప్పటి ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి పరారై ఇండియాకు వచ్చి తలదాచుకున్న అనంతరం బంగ్లాదేశ్‌లో పరిస్థితులు ఇకనైనా చక్కబడతాయనుకున్న ప్రజాస్వామ్యవాదుల ఆశలను యూనస్ అడియాసలు చేశారనడంలో సందేహం లేదు. హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో బంగ్లా ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దానికితోడు హసీనాతో తనకున్న పాత వైరాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆమెకు ఆశ్రయం కల్పించిందన్న అక్కసుతో ఇండియాతో తెగతెంపులు చేసుకోవడానికి కూడా సిద్ధపడటం ఆయన దుందుడుకు వైఖరికి నిదర్శనం. స్వతంత్ర బంగ్లాదేశ్ అవతరణలో కీలకపాత్ర పోషించిన అవామీలీగ్ పార్టీది ఏడున్నర దశాబ్దాల ఘన చరిత్ర. షేక్ హసీనాతో వ్యక్తిగత విభేదాల కారణంగా దేశ తాత్కాలిక సారథి యూనస్ ఆ పార్టీపై ఇటీవల ఉగ్రవాద నిరోధక చట్టం కింద నిషేధం విధించడం ప్రజాస్వామికవాదులను ఆశ్చర్యానికి గురిచేసింది. బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్‌లో అవామీలీగ్ నేతలపై నడుస్తున్న కేసుల విచారణ పూర్తయ్యేవరకూ నిషేధం కొనసాగుతుందని యూనస్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో అవామీలీగ్ పోటీ చేసే అవకాశాలు అడుగంటినట్లే. ఎందుకంటే, అప్పటివరకూ విచారణ పూర్తికాకుండా యూనస్ ప్రభుత్వం చేయవలసినదంతా చేస్తుంది. షేక్ హసీనాపై బనాయించిన వందకు పైగా కేసులు ఒక కొలిక్కి రావడానికి ఏళ్లూపూళ్లూ పడుతుందన్న సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.



గత ఏడాది ఆగస్టు 8న బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా పదవీబాధ్యతలు చేపట్టిన యూనస్, అవామీలీగ్ నియంతృత్వ విధానాలనుంచి దేశానికి విముక్తి కల్పించి, దేశాన్ని ప్రజాస్వామిక పంథాలో నడిపిస్తానని శపథం చేశారు. కానీ పదవి చేపట్టి పదినెలలు దాటినా ఇప్పటికీ పాలనపై పట్టు సాధించలేదు సరికదా శాంతిభద్రతల పరిస్థితి సైతం నానాటికీ తీసికట్టు నాగంభొట్లు అన్న చందంగా మారింది. ఆయన పాలనలో విదేశాంగ విధానామూ కప్పదాట్లు తొక్కుతోంది. ఇప్పటివరకూ బంగ్లాదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఇండియాతో స్నేహపూర్వక సంబంధాలనే కోరుకోగా, అందుకు భిన్నంగా యూనస్ కోరి కయ్యానికి కాలుదువ్వుతున్నారు. ఇండియా సహకారమే లేకపోతే బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ప్రపంచపటంలో స్థానం సంపాదించుకుని ఉండేది కాదన్న ఇంగితం మరచిన బంగ్లా ప్రభుత్వ తాత్కాలిక అధినేత, చైనా, పాకిస్తాన్‌లకు దగ్గరయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు విస్తుగొలుపుతున్నాయి. అవామీలీగ్‌పై నిషేధం ఉన్న కారణంగా రాబోయే ఎన్నికల్లో పోటీ ప్రధానంగా మాజీ ప్రధాని ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి), కొత్తగా ఏర్పడిన నేషనల్ సిటిజన్ పార్టీ, జమాత్ ఏ ఇస్లామీల మధ్యే ఉంటుంది. బంగ్లాదేశ్‌లో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో బిఎన్‌పి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇండియాతో దౌత్య, వాణిజ్య బంధాలు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, తాజాగా ఆ పార్టీ ఇండియాతో స్నేహసంబంధాలను కోరుకుంటున్నామని ప్రకటించడం ఆహ్వానించదగిన పరిణామం. ఇది ఇండియాకు కూడా కలసివచ్చేదే. ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం చైనా, పాకిస్తాన్‌లతో అంటకాగేందుకు ఉవ్విళ్లూరుతున్న నేపథ్యంలో బిఎన్‌పికి పరోక్షంగా మద్దతు ప్రకటించడం ఇండియాకు అత్యంత ఆవశ్యకం.

# చచ్చేటంత అభిమానం దేనికి?



బెంగళూర్ :వినోదాన్ని విషాదంగా మారుస్తున్న సంఘటనలు దేశంలో తరచూ జరగడం ఇప్పుడు మనం చూస్తున్నాం. ముఖ్యంగా ప్రజలకు వినోదాన్ని అందించే సినిమా, క్రికెట్ రంగాలకు చెందిన నటులకోసం, క్రీడాకారులకోసం ప్రాణాలు పోగొట్టుకునే స్థితికి చేరుకుంటున్నారు అభిమానులు. ఇప్పుడు మతం, రాజకీయాలు, సినిమా, క్రికెట్.. ఈ నాలుగింటి చుట్టే ప్రపంచం తిరుగుతున్నట్టుగా కనిపిస్తుంది మనకు. జరుగుతున్న సంఘటనలు చూస్తే మితిమీరిన అభిమానం కారణంగా మతసంబంధమైన సభలు, రాజకీయ సభలు, సినిమా ఈవెంట్లు, క్రికెట్ మ్యాచ్‌ల కోసం జమగూడే ప్రజలు ప్రమాదాలకు గురికావడం, విలువైన ప్రాణాలు కోల్పోవడం, ఉజ్వల భవిష్యత్తును అర్థంతరంగా ముగింప చేసుకోవడమే కాకుండా కుటుంబాలకు తీవ్ర దుఃఖాన్ని మిగులుస్తున్నారు. మూడు రోజుల క్రితం బెంగళూరులో చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాట సంఘటన చూసిన తర్వాత వీటిని అరికట్టవలసింది ఎవరు? జాగ్రత్తలు తీసుకోవాల్సింది ఎవరు? పదేపదే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నా ముందు జాగ్రత్త చర్యలు లేకపోవడానికి కారకులెవరు? అన్న అంశాలమీద తీవ్రమైన చర్చ జరుగుతున్నది. ఈ సంవత్సరం ఆరంభంలోనే ఎంతో ప్రతిష్మాత్మకంగా నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమం కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనలో అధికారికంగా మృతుల సంఖ్య 30గానే ప్రకటించినా ఇంకా చాలామంది చనిపోయి ఉంటారని పరిశీలకులు, మీడియా చెప్తున్న విషయం. కోట్లమంది పాల్గొనే ఇటువంటి కార్యక్రమంలో 30 మంది చనిపోతే విశేషమేముందని ఎవరైనా వాదించవచ్చు. కానీ, ఎవరూ అసహజ మరణానికి గురికాకూడదన్న స్పృహ లేనివారే అలా మాట్లాడతారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గతంలో కూడా మనం తొక్కిసలాటలు, మరణాలకు సంబంధించిన వార్తలు విన్నాం. పదేళ్లక్రితం గోదావరి పుష్కరాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి రాష్ట్ర అధినేత ప్రచారంకోసం చేసిన ఆర్భాటం కారణంగా జరిగిన తొక్కిసలాటలో దాదాపు 30 మంది మరణించిన విషయం తెలిసిందే. రాజకీయ సభల్లోనూ జాగ్రత్తలు తీసుకోని కారణంగా జరిగిన విషాదాలు అనేకం. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికలకు ముందు అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అధినేత నెల్లూరు జిల్లాలోని కందుకూరు అనే చోట తన సభకు వచ్చిన జనం అధిక సంఖ్యలో కనిపించడం కోసం చేసుకున్న ఏర్పాట్ల కారణంగా జరిగిన తొక్కిసలాటలో ఎనిమిదిమంది మరణించారు. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని ముక్తి పొందాలనుకున్న భక్తులు టికెట్ల కోసం ఏర్పాటైన క్యూలో నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారు. తాజాగా ఇంకా మన జ్ఞాపకాల్లోంచి తొలగిపోని సినిమా సంఘటన హైదరాబాద్‌లో జరిగింది. ఓ ప్రముఖ నటుడు తన సినిమా ప్రీమియర్ షోకు వెళ్తే, ఆయనను చూడడానికి ఎగబడిన అభిమానుల మధ్య జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందడం, మరొక బాలుడు గాయాలపాలై నెలల తరబడి స్పృహ లేకుండా ఆసుపత్రిలో పడి ఉండడం చూశాం. ఇప్పుడు ఐపిఎల్ విజేతలైన బెంగళూరు రాయల్ చాలెంజర్స్ ఆటగాళ్ళను అభినందించడం కోసం బెంగళూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది చనిపోయారు. 11 మంది ఆడే క్రికెట్ ఆట ఓ 11మంది ప్రాణాలు తీయడానికి దారి తీసింది. మత సంబంధమైన కార్యక్రమాల్లో గాని, రాజకీయ సభల్లో గాని, సినిమా ఫంక్షన్లలో గాని, క్రికెట్ స్టార్లను చూడడానికి ఎగబడిన జనసందోహంలో గానీ ప్రాణాలు కోల్పోతున్నవాళ్ళు ఎవరు? వాళ్ళను ఆయా సందర్భాలకు తగిన పేర్లతో పిలుచుకుంటాం. మత సంబంధమయిన కార్యక్రమాలలో పాల్గొంటే భక్తులని, రాజకీయ సభలయితే కార్యకర్తలు, ప్రజలు అని, సినిమా ఫంక్షన్లయితే ప్రేక్షక దేవుళ్ళు, క్రికెట్ ఆట చూడటానికి వెళితే క్రీడాభిమానులు అని. అయితే మొత్తంగా వీళ్లంతా మనుషులు. చదువుకుని పైకి రావలసిన వాళ్ళు, తమ కుటుంబాలకు ఆధారంగా ఉండవలసిన వాళ్ళు, ఎన్నో బాధ్యతలు మోస్తున్నవాళ్ళు అయి ఉంటారు. ఎందుకు ఇది రోజురోజుకు ఇలా పెరుగుతున్నది? వ్యక్తులు, వ్యవస్థ దీనిగురించి ఆలోచించి బెంగళూరు సంఘటన తర్వాత మరొక్క మనిషి కూడా ఇలా అసహజ మరణానికి గురికాకుండా చూడాల్సిన అవసరం ఉన్నది. బెంగళూరు విషాదంలో మరణించినవారిలో 13 ఏళ్ల బాలిక తప్ప అంతా 19 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు వాళ్లే. ఒక్కరు మాత్రమే 35 సంవత్సరాల వ్యక్తి. వీరంతా తమ కుటుంబాలకు విషాదం మిగిల్చి తరలిపోయారు. వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందినవాళ్లే. రోజు కూలి చేసుకునే, పానీ పూరి అమ్ముకొని జీవించే, కష్టం చేసుకుని బతికే తమ తల్లిదండ్రులకు మంచి జీవితం ఇవ్వడం కోసం ఉన్నత చదువులు చదువుకుంటున్నవాళ్లు. ఇప్పుడా కుటుంబాలకు దిక్కెవరు?పోనీ, అదేమీ భారతజట్టు ప్రపంచ కప్ గెలుచుకొచ్చిన సందర్భం కాదు. అది ప్రజలకు ఉచితంగా వినోదాన్ని అందించే క్రీడగా కూడా లేదు. అదొక వ్యాపారం. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అనే ఒక ఫ్రాంచైజీ టీం. డబ్బుగలవారు ఇటువంటి టీంలను కొనుక్కుని ఆడించి మరింత డబ్బు, పలుకుబడి సంపాదించుకునే ఆట. ఆ జట్టు బెంగళూరు తరఫున ఆడి గెలిచింది కాబట్టి బెంగళూరులో సంబరాలు చేసుకున్నారు అనుకోవచ్చు. జట్టు గెలిచిన రోజు రాత్రి హైదరాబాద్ నగరంలో సచివాలయం ఎదుట నెక్లెస్ రోడ్‌లో జరిగిన ఉన్మాద ప్రదర్శనను ఎలా చూడాలి? ఇది దురభిమానానికి పరాకాష్ఠ. అక్కడ మెట్రో రైల్ బ్రిడ్జి కింద క్రికెట్ అభిమానులు బాణాసంచా కాల్చి జనం మీదకు తిప్పుతూ తమ ఉన్మాదాన్ని ప్రదర్శించారు. ఆ గెలిచింది హైదరాబాద్ జట్టు కాదు, అందులో ఒక్క హైదరాబాద్ ఆటగాడైనా లేడు. అటువంటప్పుడు హైదరాబాద్‌లో ఎందుకీ ఉన్మాద ప్రదర్శన? క్రికెట్ అనే క్రీడకు అభిమానులు ఎక్కడైనా ఉంటారు. ఇది ప్రపంచ స్థాయి క్రీడ అనుకుంటే దానిపట్ల రోజురోజుకూ పెరుగుతున్న దురభిమానం ఉన్మాదస్థాయికి చేరుకోవడం చూస్తున్నాం. బెంగళూరు సంఘటననే తీసుకుంటే విజయోత్సవం ఏర్పాటుచేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు యాజమాన్యం, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ మాత్రమే ఈ దుర్ఘటనకు బాధ్యత వహించాలా? రాష్ట్ర ప్రభుత్వానికి, దాని అధీనంలో పనిచేసే పోలీసు వ్యవస్థకు ఏం సంబంధం లేదా? నిర్వాహకులు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నా, తీసుకోకపోయినా ఆ కార్యక్రమం జరగబోతున్నట్టుగా ముందుగానే ప్రకటించి ఉన్నారు. అంతేకాకుండా ఉచిత ప్రవేశం అనే ప్రచారం కూడా జరిగిన కారణంగా అభిమానులు పెద్దసంఖ్యలో గుమికూడబోతున్నారని పోలీస్ శాఖ ఊహించకపోవడం, కట్టుదిట్టమైన చర్యల కోసం తగిన బలగాలను అక్కడ మోహరించకపోవడం కచ్చితంగా పోలీస్ శాఖ వైఫల్యం కిందకే వస్తుంది. ఇటువంటి సంఘటనలు మామూలే అన్నట్టుగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు గతంలో ఇంకెక్కడో తమ వైరిపక్షాలు అధికారంలో ఉన్నచోట జరిగిన సంఘటనలను ఉదహరించడం సబబు కాదు. దీనికి సంబంధించి హైదరాబాదులో ఆ రాత్రి జరిగిన సంఘటన మీద నగర కొత్వాల్ సివి ఆనంద్ చేసిన ఒక ట్వీట్‌కు స్పందిస్తూ ఒక పౌరుడు ఇలా ముందు సమాచారం లేకుండా వీధిలోకి వచ్చి జనానికి ఇబ్బంది కలిగించే మూకలను వీడియోలలో గుర్తించి వారి మీద సంబంధిత సెక్షన్లకింద కేసులు నమోదు చేయవచ్చునని సూచించారు. క్రికెట్ అభిమానులే కాదు, వివిధ సందర్భాల్లో ఇలా వేళ కాని వేళలో, ఎటువంటి భద్రతా చర్యలకు అవకాశం లేని విధంగా జనానికి ఇబ్బందులు కలిగించే వారి మీద కనీస చర్యలు ఉంటే తప్ప ఇటువంటి వారి కట్టడం సాధ్యం కాదు. పరిపాలన వ్యవస్థ.. ముఖ్యంగా పోలీస్ శాఖ ఈ దిశగా ఆలోచన చేస్తే భవిష్యత్తులో మరిన్ని సంఘటనలు జరగకుండా, మరికొంతమంది అమాయకంగా ప్రాణాలు పోగొట్టుకోకుండా చూసినవాళ్ళు అవుతారు. భక్తులు, అభిమానులు, కార్యకర్తలు కూడా సీరియస్‌గా ఆలోచించాల్సిన విషయం ఒకటి ఉంది. నాయకులు, మతగురువులు, సినిమాస్టార్లు, క్రికెట్ హీరోలు బాగానే ఉంటారు, హద్దులు మీరిన అభిమానం ప్రదర్శించడంవల్ల వ్యక్తిగతంగా నష్టపోయేది అభిమానులే. హైదరాబాదులోని సంధ్యా థియేటర్ దగ్గర జరిగిన సంఘటన తదనంతర పరిణామాలు ఇందుకు మంచి ఉదాహరణ.

## ప్రజల్లోకి వెళ్లండి..కార్యక్రమాలు వివరించండి

అమరావతి, కూటమిపై ఎన్నో ఆశలతో ప్రజలు గెలిపించారని.. ఎమ్మెల్యేలు అందరూ అందుకు అనుగుణంగా నడుచుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారనే విషయాన్ని ఎమ్మెల్యేలు గుర్తుపెట్టుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోవద్దని, పనితీరు మెరుగు పరుచుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్నిపెంచే విధంగా ఎమ్మెల్యేలు వ్యవహరించాలని కోరారు. శనివారం తెలుగుదేశం కార్యకర్తలు, నేతలు, ఎమ్మెల్యేలతో అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా సందర్భంగా జూన్ 12వ తేదీన అమరావతిలో 2 వేలమందితో ఓ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో ఏడాది పాలనపై 12న నియోజకవర్గాల్లో విజయోత్సవ ర్యాలీలు చేయాలని నిర్ణయించారు. అదే రోజున సాయంత్రం ఎన్డీయే పక్షాలు, అధికార యంత్రాంగంతో సమీక్ష నిర్వహించనున్నారు. వచ్చే నాలుగేళ్లలో చేపట్టే కార్యక్రమాలపై ఇక్కడ చర్చించనున్నారు. ఆ తర్వాత కూడా ఏపీవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమం చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఎమ్మెల్యేలు ఎవరెవరు ఏం చేస్తున్నారనే సమాచారం తన దగ్గర ఉందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నేతలు నిరంతరం ప్రజలకు అందుబాటు-లో ఉండాలని ఆదేశించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీలో ఉన్న పరిస్థితులు కూడా ప్రజలకు తెలియజేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. 2024 జూన్‌కి ముందు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని గుర్తుచేశారు. తాను నాలుగోసారి సీఎం అయ్యానని.. కానీ ఇలాంటి పరిస్థితి ఎప్పుడు చూడలేదని వెల్లడించారు. అయినా ఏపీ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నామని తెలిపారు. మనం రాష్ట్ర సంక్షేమం కోసం యజ్ఞం చేస్తుంటే రాక్షసులు కొంతమంది భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారిని కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. ఏపీలో గతంలో గంజాయి విచ్చలవిడిగా లభ్యం అయ్యేదని.. ఇప్పుడు కంట్రోల్ చేస్తున్నామని అన్నారు. శాంతి భద్రతలు, గంజాయి, రౌడీయిజాన్ని నిర్దాక్షిణ్యంగా అణచి వేస్తామని.. ఎవరిని ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మహానాడు ఈసారి బాగా జరిగిందని చెప్పారు. వచ్చే నెల నాటికి అన్ని కమిటీ-లు, రాష్ట్ర కమిటీ-లను నియామకం పూర్తి చేస్తామని తెలిపారు. యోగా డేను జయప్రదం చేయాలని కోరారు. కార్యకర్తలు యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ఏడాది కాలంలో స్పష్టమైన మార్పు చూపించినట్లు- సీఎం చంద్రబాబు తెలిపారు. అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరి పనితీరుపై సర్వేలు చేయిస్తున్నాం. బాగా పనిచేసిన వారికి ప్రోత్సాహం ఉంటుంది. పార్టీ, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఎవరినైనా వదులుకుంటాం. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పనిచేయాలి. ప్రజలు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలి. వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదనేది నా ఆలోచన. గత ప్రభుత్వంలో రాష్ట్రమంతా నిరాశ, నిస్పృహ, చీకటి అలముకుంది. భయంకర పరిస్థితులను రాష్ట్ర ప్రజలు చూశారు. రాష్ట్రం పేరు వింటేనే దగ్గరకు వచ్చే పరిస్థితి లేకుండా చేశారు. అసమర్థ పాలనతో ఏపీని ఆర్థికంగా పాతాళానికి తొక్కేశారు. మనం తీసుకునే నిర్ణయాలతోనే మంచి ఫలితాలు వస్తున్నాయి. గత ప్రభుత్వాన్ని భరించలేకే ప్రజలు ఏకపక్షంగా మనల్ని గెలిపించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు, నివేదికలు ఉంటాయి. మంచి చేస్తే అభినందిస్తా.. తప్పు చేస్తే దూరం పెడతా. త్వరలోనే ఒక్కో ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు నిర్వహిస్తా. ఎవరు ఎంత అడ్డుపడినా రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞం ఆగదు. ఈ నెల 12 లేదా 14 లోపే తల్లికి వందనం నగదు తల్లులకు అందిస్తాం చంద్రబాబు తెలిపారు.

## మహారాష్ట్ర ఎన్నికలపై వ్యాఖ్యలు దుర్మార్గం

ముంబై, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దీంతో ఆయనపై భాజపా తీవ్ర విమర్శలు చేస్తోంది. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ రాహుల్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ రాష్ట్ర ఓటర్లను అవమానించారని,. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. క్షేత్రస్థాయిలోని వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలి. తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం ఆయన అలవాటుగా మార్చుకున్నారు. తాను ఏం మాట్లాడుతున్నారో అతడికైనా అర్థం అవుతోందా..అని ప్రశ్నించారు. తప్పుడు ప్రచారం మానుకోకపోతే ఆయన పార్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. వారి తీరు ఇలాగే కొనసాగితే ఎప్పటికీ గెలవలేరు. ఈ విషయాన్ని రాహుల్ అర్థం చేసుకోవాలి. ఇకనైనా మేలుకోండి అంటూ హెచ్చరించారు. గతంలో ఆయన చేసిన అసత్య ప్రచారంపై స్పందించిన ఎన్నికల కమిషన్ సాక్ష్యాధారాలతో అవన్నీ అసత్యాలని నిరూపించింది. గత ఎన్నికల ఓటర్ల జాబితాను తాజాగా విడుదల చేసింది. అసత్యాలు మాని ప్రజలకు మంచి చేసేందుకు కృషి చేయండని ఫడణవీస్ సూచించారు. కాగా.. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కమలం పార్టీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నకిలీ ఓటర్ల నమోదు, పోలింగ్‌లో అవకతవకలు, ఆధారాలను దాయడం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. భాజపా ఎందుకు అలా ప్రవర్తించిందో అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదని.. రిగ్గింగ్ అనేది మ్యాచ్ ఫిక్సింగ్ లాంటిదని వ్యాఖ్యానించారు. మోసం చేసే పార్టీ ఆటలో గెలవొచ్చు.. కానీ అలాంటి విజయం వ్యవస్థలను దెబ్బతీస్తుందని రాహుల్ అన్నారు. మహారాష్ట్ర వలే బిహార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కానుందని విమర్శించారు. దీనిపై స్పందించిన భాజపా రాహుల్‌కు కౌంటర్ ఇచ్చింది.

## మేనిఫెస్టో హామీలకు మంగళం

అమరావతి, వైసీపీ ఇచ్చిన పెన్షన్ల కంటే కూటమి ప్రభుత్వం తక్కువ ఇస్తోందని.. ఈ ఘనత చంద్రబాబుదే అని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు విఫలం అయ్యారంటూ దుయ్యబట్టారు. 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ ఇస్తా అన్న చంద్రబాబు.. ఇప్పుడు అతిగతి లేకుండా వదిలేశారంటూ మండిపడ్డారు. ఇంటింటికి పెన్షన్స్ ఇచ్చే విధానం పోయిందని.. వృద్ధులు, వికలాంగులు ఎండలలో ఉంటూ ఇబ్బడి పడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన పెట్టు-బడిదారులు భయపెడుతున్నారని తెలిపారు. దావోస్ కు వెళ్లిన చంద్రబాబు, లోకేష్ ఖాళీ చేతులతో వచ్చారు. ఏమైనా ప్రశ్నిస్తే రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఉచిత సిలెండర్ అన్నారు.. ఫ్రీ బస్ అన్నారు. అన్ని హామీల్లోనూ వెన్నుపోటు-పొడిచారు. నిరుద్యోగులకు భృతి, అమ్మకు వందనం, రైతులకు పీఎం కిసాన్ కిసాన్ ఇవ్వకుండా మోసం చేశారు. ఇంత చేతకాని ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ఇచ్చిన హామీలను మొదటి సంవత్సరంలో ఇచ్చిన ఘనత వైసీపీది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో మొదట స్థానం తెచ్చింది సీఎం జగన్. రాష్ట్రంలో 22 శాతం జిడిపి రేట్ తగ్గిపోయింది.

## ఉపాధిరంగంగా ఫుడ్ ప్రాసెసింగ్

న్యూఢిల్లీ,వ్యవసాయరంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారేలా ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణమిదేనని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కూలీ కోసం పట్టణాలకు తరలి వెళు తున్న వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని సూచిస్తున్నారు. అలా చేయడంవల్ల ఆధునిక వ్యవసాయరంగం మారగలదని అన్నారు. ఇప్పుడు పండుతున్న పంటలకు కూడా సరైన ప్రాసెసింగ్ యూనిట్లు లేవని అంటున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అంటున్నారు. ఇలాంటి యూనిట్లు పెట్టేవారిని ప్రోత్సహించాలి. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి పంటలే. రైతులను కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జటిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. వంటనూనెల మిల్లులను దేశీయంగా రూపొందించి, మన నూనెలను వాడగలిగేలా చేయాలన్నారు. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అవసరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. అప్పుడు మన అవసరాలకు అనుగుణంగా పంటల విధానం ఏర్పడుతుందని అన్నారు. దేశీయంగా ఉపాధి అవకాశాలు పెంచుకుంటూ.. ఉత్పత్తి రంగాలకు ఊతమిచ్చేలా సాగాల్సి ఉంది. అందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పెంచుకోవాల్సి ఉంది. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్లి దినసరి కూలీలుగా మారుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో పొట్టను బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకుని నష్టాలపాలు బ్రతుకునీడ్చలేక,అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు అనేకమంది మళ్లీ వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. వారి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునేలా చేయాలి. ఈ క్రమంలో విదేశాలకు భారీగా ఎగుమతి చేసేలా పంటలు పండించగలగాలి. దీంతో మనకు విదేశీమారకం కూడా ఆదా కాగలదు. అలా పంటలు పండించే సత్తా మన రైతాంగానికి ఉందని గుర్తుంచుకోవాలి. మన రైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపాడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణ మాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి.

## సిమ్లా ఒప్పందం రద్దుపై పాక్ మడతపేచీ

ఇస్లామాబాద్,ఇటీవల పహల్గామ్ దాడి తరవాత భారత్ సిమ్లా ఒప్పందం రద్దుచేస్తూ ప్రకటన చేసింది. అయితే దనీఇని పాక్ పెద్దగా పట్టించుకున్నట్లుగా కనిపించడం లేదు. ఏప్రిల్‌లో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత నుంచి భారత్-పాక్ సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఆ తర్వాత మే 7వ తేదీన పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్ర స్థావరాలపై దాడులు చేసింది. ఆ తర్వాత మే 8,9,10 తేదీల్లో పాక్ సైన్యం భారత మిలిటరీ బేస్‌లపై దాడికి యత్నించగా.. మన దళాలు తిప్పికొట్టాయి. ఆ తర్వాత పాక్ అభ్యర్థన మేరకు భారత్ ఆపరేషన్ సిందూర్‌కు తాత్కాలిక విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. భారత్‌తో 1972లో జరిగిన సిమ్లా ఒప్పందం నుంచి వైదొలగే అంశంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పాకిస్థాన్ విదేశాంగ శాఖ వివరణ ఇచ్చింది. ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ మాట్లాడుతూ సిమ్లా ఒప్పందానికి ఇక విలువలేదు.. అదొక డెడ్ డాక్యుమెంట్ అని వ్యాఖ్యానించారు. సింధూజలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేశారో లేదో తెలియదు గానీ.. సిమ్లా అగ్రిమెంట్ పనైపోయిందని పేర్కొన్నారు. దీంతో తాము 1948 నాటి స్థితికి చేరుకొన్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న నియంత్రణ రేఖ కాస్తా కేవలం కాల్పుల విరమణ రేఖగా భావిస్తామన్నది ఆయన ఉద్దేశం. 1948 భారత్-పాక్ యుద్ధం తర్వాత దీనిని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో విదేశాంగశాఖ ప్రతినిధి వివరణ ఇస్తూ భారత్‌తో ఏ ద్వైపాక్షిక ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి అధికారికంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం ఆ దేశంతో ఉన్న సిమ్లా ఒప్పందంతో సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలు అమల్లో ఉంటాయఅని ఆ దేశానికి చెందిన ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్‌కు వెల్లడించారు. 1971లో భారత్-పాక్ యుద్ధం తర్వాత ఈ ఒప్పందం చేసుకొన్నారు. దీని ప్రకారం భారత్-పాక్ సంబంధాల నిర్వహణకు సంబంధించిన చర్యలు తీసుకొంటారు. ఈ ఒప్పందం ద్వారా శాంతియుత ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని రెండు దేశాలు తీర్మానించాయి. ఇందులో కశ్మీర్ అంశమూ ఉంది. ఈ ఒప్పందంపై అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాక్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సంతకాలు చేశారు. దీని ప్రకారం ఇరుదేశాలు మూడో దేశం జోక్యం లేకుండా ద్వైపాక్షిక చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలి. జమ్మూ కశ్మీర్‌లో కాల్పుల విరమణ లైన్‌గా నియంత్రణ రేఖను పునర్నిర్వచించడం. దానిని మార్చకూడదన్న నిర్ణయానికి రెండు దేశాలు కట్టుబడటం. బంగ్లాదేశ్ సార్వభౌమత్వాన్ని గుర్తించడంతోపాటు- ఆ దేశంతో సంబంధాలను సాధారణ స్థితికి తేవడానికి పాకిస్థాన్ కట్టుబడటం వంటి అంశాలున్నాయి.

## అమరావతి మహిళలను కించపర్చడం దారుణం

అమరావతి,అమరావతి మహిళలను కించపరచడంపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సీరియస్ అయ్యారు. అమరావతి మహిళలను అత్యంత దారుణంగా కించపరచడం నీచాతినీచం అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం జగన్ కు, ఆయన పేటీ-ఎం బ్యాచ్ కు ఇంత కన్నా మంచి మాటలే రావా. ఇంతలా విషం కక్కుతారా. చివరకు మహిళలను కించపరచడం వైసీపీ చిల్లర బుద్ధికి నిదర్శనం. సీఎం చంద్రబాబు చెప్పినట్టు- అమరావతి నిజంగానే దేవతల రాజధాని. రాజధానిని నిర్మించడానికి మేం చాలా రకాలుగా కష్టపడుతున్నాం. కానీ జగన్ బ్యాచ్ ఇలాంటి వాటితో వివాదాలు సృష్టిస్తున్నారు. అమరావతి మహిళల ఉసురు కారణంగానే 11 సీట్లకు పడిపోయారు. అమరావతి మహిళలను ఇంకా అవమానిస్తే ఆ పార్టీకి పుట్టగతులు ఉండవు. ఐదు కోట్ల మంది ఆంధ్రులకు అమరావతియే రాజధాని. మన రాజధాని మనకు ఎప్పటికీ

# పర్యావరణహితంగా అభివృద్ధి సాగాలి !



న్యూఢిల్లీ,ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అట్టహాసంగా జరుపుకున్నాం. ప్లాస్టిక్ నిషేధంపై నేతలంతా ఉపన్యాసాలు ఇచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అంతా హితవు చెప్పారు. అసలు ప్లాస్టిక్ కవర్ల ఉత్పత్తిపై నిషేధం విధించే ఆలోచన మాత్రం పాలకులు ఎక్కడా ప్రస్తావించడం లేదు. పర్యావరణ విధ్వంసానికి కారణమైన ప్లాస్టిక్‌ను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే అందుకు ప్రత్యామ్నా యాలు ఆలోచించాలి. హోటళ్లు, ఇళ్లలో ఆకులతో తయారు చేసే కవరల్ను వాడాలి. అరిటాకులు, మోదుగు, బాదామ్ ఆకులను వినియోగించేలా చేయాలి. ప్రధానంగా పెళ్లిళ్లు, హోటళ్లలో ఈ తరహా ప్రయోగం రావాలి. ఇకపోతే పేరుకుపోతున్న ప్లాస్టిక్‌ను ఏరిపారేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి. తిరుమలలో లడ్డూలను ప్లాస్టిక్ కవర్లలో ఇవ్వకుండా తాటాకు బుట్టలు, తుంగతో చేసిన లేదా జనుముతో చేసిన కవర్లన వాడాలి. ప్రయత్నం చేస్తే ఏదీ అసాధ్యం కాదు. మరోవైపు అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల నుంచి బయటపడాలి. నదులను శుభ్రం చేసి, అనుసంధానం దిశగా కార్యాచరణ సిద్దంచేయాలి. నదుల్లో ఎప్పుడూ నీరు అందుబాటులో ఉండేలా చూడాలి. యమునా కాలుష్యంపై ఢిల్లీ ఎన్నికల ముందు రోజూ వార్తలే. ఇప్పుడా విషయమే మరచి పోయారు. పాలకులు ఓటుబ్యాంక్ పథకాలు పక్కన పెట్టి ఇలాంటి వాటిని కూడా ఆలోచించాలి. భవిష్యత్ తరాల కోసం మనమంతా ఇప్పటినుంచే అడుగులు వేయాలి. వర్షాభావ పరిస్థితులు పదేళ్లకోసారి తప్పవని నిపుణులు అంటున్నారు. నైరుతి ప్రవేశించినా నేటికీ తగిన వర్షం జాడలేదు. అడపాదడపా అక్కడక్కడా పడుతున్న వర్షం లెక్కల్లోకి రాదు. వర్షాలు ముఖం చాటేస్తే జలాశయాలు వట్టిపోతాయి. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా పంఇంచిన పంటలకు ధరలు రాక నష్టపోతున్నారు. వర్షాలు పడని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్టపోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. నిపుణుల సలహాతో వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయగలిగితే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు. గతంలో లాగా వాగులు వంకలు పొంగే పరిస్థితి లేదు. వర్షాల తీరు ఇలాగే ఉంటే నీటి కష్టాలు తప్పేలా లేవు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. పాలకులకు దూరదృష్టి అవసరం. నదీజలాలలను ఏటా వృథాగా సముద్రంలోకి వదలాల్సిన దుస్థితి నుంచి బయట పడాలి. వాటిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. నదీ జలాలలను దేశం మొత్తానికి అందేలా...ప్రణాళికలు రూపొందించాలి. నదుల అనుసంధానంపై చర్చించాలి. దీనిపై సమగ్ర నివేదికలు రూపొందించాలి. నిపుణలను నియమించి గంగా,యమున,బ్రహ్మపుత్ర నదులను అనుసంధానించే ప్రక్రియ చేపట్టాలి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి. మోడీ తొలినాళ్లలో నదుల అనుసంధానం గురించి మాట్లాడారు. కానీ ఇప్పుడా మాట ఎత్తడం లేదు. ఇకపోతే వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్దతలను అవలంబించాలి. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్న సమయంలో వాటిని జలాశయాల్లోకి మళ్లించేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఉన్నకొద్దిపాటు ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. గతంలో వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. ఈ దుస్థితి పోవాలంటే నీటి యాజమాన్యం అవసరం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. అలాగే వ్యవసాయంపై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు పెంచుకునేలా రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను కబ్జాకోరులు మింగిన పాపానికి ఏటా కురుస్తున్న వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగిపోతున్నాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించుకోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. వర్షపునీటిని ఒడిసి పట్టుకుని ముందుకు సాగేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఇది రాష్ట్రానికి, దేశానికి కూడా వర్తించేలా ఉండాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతి చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటే ఓ పదేళ్లకు కాని ఆచారణలోకి రాదు. వ్యవసాయరంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగ మించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడి ముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గిపోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపనిగా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. వంటనూనెల కోసం విదేశాలపై ఆధారపడకుండా దేశీయంగా నూనెగింజల ఉత్పత్తులను పెంచుకోవాల్సి ఉంది. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. కనీసం ఓ పదేళ్ల పాటు వ్యవసాయరంగ ఉత్పత్తులపై దృష్టి సారిస్తే భారతదేశం ఆర్థకంగా మళ్లీ పుంజుకోగలదు. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. రోజురోజుకూ నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగగలవు.

## వినికిడి లోపం బాలికకు ఉచిత వైద్యం

హైదరాబాద్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. వినికిడి లోపం ఉన్న చిన్నారి లిఖితకు పూర్తి ఉచిత వైద్యం అందించేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వినికిడి లోపం కారణంగా బాధపడుతున్న నాలుగేళ్ల నేతావత్ లిఖితా శ్రీకి తక్షణం ప్రభుత్వ ఈఎన్టీ ఆస్పత్రిలో పూర్తిగా ఉచితంగా కాక్లియర్ ఇంఎ÷-లాంట్ సర్జరీ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నలుగురు పిల్లలతో కలిసి ఆడుతూ పాడుతూ గడపాల్సిన ఆ పాపకు వినికిడి లోపం శాపంగా మారింది. ఎవరూ ఏం చెబుతున్నారో కూడా అర్థం కాక అమాయకంగా అలాగే ఉండిపోతోంది. ఆ పాపలో వినికిడి లోపాన్ని గుర్తించిన తర్వాత తల్లిదండ్రులు చికిత్స కోసం ఎంతోమంది వైద్యులను సంప్రదించారు. కాక్లియర్ ఇంఎ÷-లాంట్ సర్జరీ తప్పనిసరని చెప్పడంతో అందుకు అవసరమయ్యే ఖర్చును భరించే స్థోమత ఆ కుటు-ంబానికి లేదు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి రాగానే వెంటనే మానవత్వంతో స్పందించారు.

# ఎన్‌డిఎ పక్షాలు మోడీ భజన మానాలి !



న్యూఢిల్లీ,ఎన్‌డిఎ పక్షంలో ఉన్న ఆయా పార్టీల నేతలు అధికారం కోసం కాకుండా దేశ హితం కోసం పనిచేయాలి. సమస్యలను దేవం ముందు ఉంచాలి. వాటి పరిష్కారానికి ఒత్తిడి తేవాలి. ప్రధానంగా నిరుద్యోగం, ఉపాధి రంగాలు క్షీణంచాయి. గత పదేళ్ల మోడీ అధికారం వేరు. ఇప్పుడు మోడీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. అది కూడా ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతోంది. ఈ క్రమంలో చంద్రబాబు, నితీశ్ కుమార్లాంటి వారు సమర్థత కనబర్చాలి. జలవనరులు మొదలుకుని అనేక సమస్యలపై చర్చించాలి. ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని ఎన్‌డిఎ పక్షాలు ఇక దేశం కోసం పనిచేయాల్సి ఉంది.ఏడాది కాలం గడిచింది. ఎన్‌డిఎ పక్షాలప్రభావం ఏమాత్రం లేదన్నది సుస్పష్టంగా కనిపిస్తోంది. కేవలం సొంత రాష్ట్రాల ప్రయోజనాలు కాకుండా దేశం కోసం ఆలోచన చేయాల్సిన బాధ్యత ఎన్‌డి పక్షాలపై ఉంది. కేవలం మోడీని పొగడ్తలతో ముంచెత్తకుండా ముందుకు సాగాలి. మోడీ పదేళ్ల కాలం పాలన ఒక ఎత్తు..ఈ ఐదేళ్ల కాలం మరో ఎత్తు అన్న విషయం గుర్తించి ముందుకు సాగాల్సి ఉంది. ఇందులో ఏడాది గడిచింది. ఇక మిఇలింది నాలుగేళ్ల కాలమే. ఇప్పుడే ఎన్‌డిఎ పక్షాలకు అధికారం వచ్చింది. ఉమ్మడిగా పాలించే అవకాశం చిక్కింది. ఈ క్రమంలో వీరంతా దేశం కోసం కఠిన పరిశ్రమ చేయాలి. దేశం ఎన్నో సమస్యలను, సవాళ్లను ఎదుర్కొంటోంది. అవేమీ పరిష్కరించ లేని సమస్యలు కాదు..అవన్నీ కూడా పరిష్కార యోగ్యంగా ఉన్నవే. కాకపోతే చిత్తశుద్ధి పెట్టి పనిచేయాల్సి ఉంది. ప్రధానంగా ఎన్‌డిఎ పక్షాలు ముందుగా దేశం ముందున్న సమస్యలపై చర్చ చేయాలి. తమతమ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల ఆకాంక్షలను తెలుసు కోవాలి. వాటిని ఎన్‌డిఎ వేదికపై పెట్టి చర్చించాలి. ముందుగా ప్రజలు తమంతగా తాము ధైర్యంగా బతకగలిగే పరిస్థతులను తీసుకుని రావాలి. ఇందుకు సంకల్పం కూడా కావాలి. ఎన్నికల్లో గెలిచాం..మరో ఐదేళ్ల తరవాత గెలవడం ఎలా అన్న తరహాలో పథకాలతో పోటిపడుతూ పోతే ప్రజలు మరో పార్టీని ఆదరిస్తారని గుర్తించాలి.దేశీయంగా విమానయాన రంగం పూర్తిగా దెబ్బతింది. అనేక నగరాలకు నేరుగా వెళ్లేలా విమాన సర్వీసులను గుర్తించాలి. ప్రజలకు అందుబాటు ధరల్లో విమాన సౌకర్యం కలిగించేలా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఇక ప్రధానంగా ఉచిత పథకాలకు, తాయిలాలకు స్వస్తి పలకాలి. ప్రజలను బిచ్చగాళ్లుగా చేసే పథకాల రచనను మానాలి. ప్రజలు స్వయం శక్తితో బతికేలా చేయాలి. వండివార్చి పెడతామన్న రీతిలో డబ్బుల పందేరం చేసే పద్ధతులను మానుకోవాలి. ప్రధానంగా విద్య,వైద్యరంగాలను బలోపేతం చేయాలి. ప్రతి ఒక్కరు సర్కార్ స్కూళ్ల వైపు చూసేలా చేయాలి. కార్పోరేట్ దోపిడీని అడ్డుకోవాలి. వైద్యరంగంలో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకుని రావాలి. ప్రభుత్వ ఆస్పత్రులు కార్పోరేట్ ఆస్పత్రులను తలదన్నేలా పటిష్టం చేయాలి. ఇందుకు ఎంతైనా ఖర్చు చేయాలి. అలాగే ధరలను అదుపు చేసేందుకు కసతరత్తు చేయాలి. నిరుద్యోగ సమస్యను ప్రధాన అంశంగా తీసుకుని ముందుకు సాగాలి. అదేపనిగా ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలను అడ్డుకోవాలి. విశాఖస్టీల్ కావచ్చు..ఎల్‌ఐసి లాంటి సంస్థలను బలోపేతం చేస్తే కొంతయినా నిరుద్యోగ సమస్య తీరుతుందని గుర్తించాలి. కొత్తగా సంస్థలను తీసుకుని రావాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. అవంతేగాకుండా సమస్యలు ఏవైనా పార్లమెంటులో చర్చ జరిగేలా చూడాలి. గత పదేళ్లలో ఏ అంశంలోనూ సమగ్ర చర్చ జరగలేదు. విపక్షాలను పురుగులకన్నా హీనంగా చూశారు. మాట్లాడితే సభనుంచి బయటకు పంపారు. ఈ తరహా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నుంచి బయటపడాలి. బీజేపీలో ఆత్మవిమర్శ వస్తుందని..ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారని..ప్రజలకు మేలు జరుగుతుందని అంతా భావించేలా చేయాలి. బిజెపి అంటే ఇక్కడ మోడీ అని మాత్రమే గుర్తించాలి. మంచి చేసి ప్రజల మనసులు గెల్చుకోవడం ద్వారా ఎన్నికల్లో గెలవాలన్న భావన లేదా ఆలోచన స్థిరపడాలి. ధరలు తగ్గించడం, ముఖ్యంగా గ్యాస్, పెట్రో ధరలు తగ్గించడం, నిత్యావసరాల ధరలు తగ్గించడం, జిఎస్టీ భారాలపై కోతలు పెట్టడం, బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గించడం, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన చేయడం వంటి విషయాల్లో ఆలోచన చేయడం వంటివి బిజెపి నేతల ఎజెండాలో ప్రధానం కావాలి. ఎన్‌డిఎ నేతల ఎజెండాలో ఇవి చేరాలి. వీటికోసం చంద్రబాబు,నితీశ్ తదితరులు పట్టుబట్టాలి. కేవలం బిజెపిని 240 సీట్లకే పరిమితం చేయడం ద్వారా ఎన్‌డిఎ నేతలకు పగ్గాలు అప్పగించారు. ఇప్పటికయినా బిజెపి అగ్రనాయకులుగా ఉన్న మోడీ, అమిత్ షా లు ఈ పరిణామాలను గుర్తించాలి. అన్ని పార్టీలకన్నా తాము భిన్నమని చెప్పుకుంటున్న బిజెపి ప్రజల కోణంలో పాలన చేయడం మొదలు పెట్టాలి. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ చేయాలి. ప్రజలకు నమ్మకం కలిగించాలి. ఇలాంటి సమయంలో బీజేపీ అగ్ర నాయకత్వం స్పీడ్ పెంచాలి. బీజేపీ ఆశించిన స్థాయిలో పరిస్థితులు కనిపించడం లేదన్నది నూటికినూరు శాతం నిజం. ఈ క్రమంలో బిజెపి తన ఎజెండాను మార్చుకోవాలి. ముందుగా ప్రజల ఆశాలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవాలి. అందుకు తగిన ప్రణాళికతో ముందుకు సాగాలి. ఇకపోతే దేశంలో రాజకీయాల తీరు మారాలి. ఇంతకాలం దూకుడు ప్రదర్శించిన బిజెపి ఇప్పుడు దేశం కోసం దూకుడు ప్రదర్శించాలి. ఉమ్మడి పౌరస్మృతి రావాల్సిందే. విపక్షాలను తిట్టిపోస్తూ..అసలు సమస్యలను పక్కదారి పట్టించే రాజకీయాలను మానుకోవాలి.

## ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం.. సబ్సిడీపై విత్తనాల సరఫరా

గుంటూరు,ఈ ఏడాది ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఈ మేరకు ఖరీఫ్ ప్రణాళికలను వ్యవసాయ అధికారులు సిద్ధం చేశారు. తొలకరి జల్లులు కురవగానే వరిసాగు చేసే పొలాల్లో పచ్చి రొట్టె ఎరువు సాగు చేయాలని వ్యవసాయ శాఖ రైతులకు సూచిస్తోంది. గ్రామాల్లో వ్యవసాయ సదస్సులు నిర్వహించి పంటల సాగుపై వ్యవసాయ అధికారులు సూచనలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట ఎరువు సాగుకు విత్తనాలు పంపిణీ వ్యవసాయ శాఖ చేపట్టింది. పిల్లి పెసర, జనుము, జీలుగ విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు అన్నదాతలు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేస్తున్నారు. తొలకరి జల్లులు కురవగానే సాగు ఆరంభించేందుకు అన్నదాతలు విత్తన సేకరణలో నిమగ్నమయ్యారు. కోటి ఆశలతో రైతులు పంటల సాగుకు సమయత్తమయ్యారు.గత ఏడాది పంటల సాగు ఆశాజనకంగా ఉంది. సకాలంలో వర్షాలు కురవటం, సాగర్ జలాశయం నిండటంతో వరి, పత్తి, మిరప ప్రధాన పంటలు విస్తృతంగా సాగయ్యాయి. ఈ ఏడాది కూడా సకాలంలో వర్షాలు కురవాలని రైతులు వరుణుడిని ప్రార్థిస్తున్నారు. రుతుపవనాలు ప్రభావంతో మే నెలాఖరుకే వర్షాలు మొదలయ్యాయి. అయితే మధ్యలో మళ్లీ వారం రోజుల గ్యాప్ వచ్చింది.ఈయేడు భార వర్షపాతం నమోదు అవుతుందని వాతావరణశాఖ వెల్లడించింది. గత ఏడాది జిల్లా అంతట పంటల సాగు ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాధారణ విస్తీర్ణంలో 90 శాతానికి పైగా ఒక్క ఖరీఫ్‌లో పంటలు సాగు అయ్యాయి. గత ఖరీఫ్‌లో వరి, మిరప సాగు గణనీయంగా పెరిగింది. రబీలో కూడా విస్తృతంగా వరి సాగు చేశారు. పత్తి, అపరాల పంటల సాగు గత ఏడాది గణనీయంగా తగ్గింది. సకాలంలో వర్షాలు కురవటంతో గత ఏడాది జూన్ నెలాఖరుకు పత్తి సాగు ప్రారంభమైంది. ఈ ఏడాది పత్తి, మిరప, వరి విత్తనాలను పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. వర్షాలు కురవగానే పత్తి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ పరిస్థితి కానరావడం లేదు. పత్తి, మిరప విత్తనాలు పంపిణీ చేయాలంటే విత్తన ఒప్పందం తప్పనిసరి. ఈ పక్రియ ఇంకా ఒక కొలిక్కిరాలేదు. దీంతో విత్తన పంపిణీ జరుగుతుందా లేదా అనే సందేహాలు నెలకొన్నాయి. వరి విత్తనాలు కూడా పంపిణీపై ఇంకా స్పష్టత రాలేదు. డిమాండ్‌కు తగ్గట్టుగా ఏపీ సీడ్స్ వద్ద విత్తన నిల్వలు లేవు. విత్తన డిమాండ్‌పై మండలాల వారీగా వ్యవసాయ అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. విత్తన సమస్యలు రైతులను వెంటాడే పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు విత్తన నిల్వలపై దృష్టి సారించాలి. అన్నదాతలు వ్యవసాయ పనులు మొదలు పెట్టారు. వీరి ఆత్రుతను విత్తనాలు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. డిమాండ్ ఉన్న ప్రత్తి విత్తనాల ప్యాకెట్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు అదే బీటీ విత్తనం కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు.

## పత్తి సాగుకే రైతుల మొగ్గు

ఆదిలాబాద్,ఆదిలాబాద్ జిల్లాలో ఏటా పత్తి సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది పత్తి పంట సాగు వైపే రైతులు మళ్లీ పరుగులు తీస్తున్నారు. గత అనుభవంతోనే ఈసారి పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు అధికంగా ఆసక్తి చూపుతున్నారు.వర్షాధార పంటగా సాగయ్యే పత్తికి జిల్లా వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు నల్లరేగడి భూముల్లో అధిక దిగుబడులు రావడమే అసలు కారణమని రైతులు చెబుతున్నారు. అధికారులు మాత్రం మిశ్రమ పంటలను సాగు చేస్తేనే మంచి ఫలితా లు వస్తాయని సూచిస్తున్నారు. రైతులు స్వయంగా పత్తి పంటను సాగు చేసిన అనుభవంతోనే ముందుకు సాగుతున్నారు. తొలకరి వర్షాలకే పత్తి పంటను విత్తుతే చీడ పీడల నుంచి తట్టుకుని అధిక దిగుబడులు వస్తాయని పేర్కొంటున్నారు. వాణిజ్య పంటగా పత్తి పంటతో అప్పులు తీరే అవకాశం ఉందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా సంప్రదాయ పంటల సాగుతో రైతులకు భారీ నష్టాలు వస్తున్నాయని భావించిన ప్రభుత్వం గత ఏడాది నుంచి పత్తి పంట సాగును ప్రోత్సహిస్తూ వస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటలైన సోయా, కంది పంటల సాగు తగ్గుతూ వస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో సోయా, కంది పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతూ లబోదిబో మంటున్నారు. ఇలాంటి పరిస్థితు ల్లో ఈ ఏడాది పత్తి పంటనే సా గు చేసేందుకు జిల్లా రైతులు అ ధికంగా ఆసక్తి చూపుతున్నారు. అయితే అధికారులు భావిస్తున్నట్లుగా మిశ్రమ పంటల సాగు విస్తీర్ణం తగ్గి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తుంది.అంచనాలకు మించిన ధరలుఅంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఎచ్చుతగ్గుల కారణంగా పత్తి పంటకు ధరలు ఉండవని ప్రచారం జరిగినప్పటికీ గతేడు పత్తి పంటల ధరలు అంచనాలకు మించి ధర పలికింది. పంట చేతికి వచ్చినప్పటి నుంచి కొనుగోలు ముగిసే వరకు మద్దతు ధరను మించిన ధరలేదక్కాయి. తెల్ల బంగారం సిరులు కురిపించడంతో ఈ సారి కూడా రైతులు పత్తి పంటపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 20వేల ఎకరాలకు పై గా పత్తి పంట సాగు విస్తీర్ణం పెరిగిందని అధికారులే చెబుతున్నారు. ఇప్పటికే రైతులు విత్తనాలను కొనుగోలు చేసి తొలకరి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఒక ఏడాది నష్టం వచ్చిన మరో ఏడాది ఆదుకోకపోతుందా అనే భావనతో పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అయితే ధరలు భాగానే ఉన్న పెట్టుబడి ఖర్చులు మరింతగా పెరిగి పోవడంతో లాభాలు అంతంత మాత్రంగానే వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లా సాగు భూమి విస్తీర్ణం 5 లక్ష ల 71 వేల ఎకరాలు కాగా ఈ సారి 3లక్షల 95వేల 200 ఎకరాలలో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. గతేడా కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయం గా పెరుగనుంది. మూడు నాలుగేళ్లుగా విస్తీర్ణం తగ్గినా గత ఏడాది ధరలు పుంజుకోవడంతో ఈసారి సాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

## ఢిల్లీ సిఎంను బెదిరించిన వ్యక్తి అరెస్ట్

న్యూఢిల్లీ,ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను చంపేస్తానని బెదిరించిన శ్లోక్ త్రిపాఠి అనే వ్యక్తిని ఢిల్లీ పోలీసులు, ఘాజియాబాద్ పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో అరెస్టు చేశారు. అతడు తాగిన మత్తులో, భార్యతో గొడవ పడిన నేపథ్యంలో అలా అన్నట్టు- ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయింది. నిందితుడిని కొత్వాలి ప్రాంతంలో పట్టు-కున్నారు. కాగా నిందితుడి లొకేషన్ పంచవటి ప్రాంతంలో గుర్తించారు. బెదిరింపుకు ఉపయోగించిన సిమ్ అడ్రస్ గోరఖ్‌పుర్‌కు చెందింది, పైగా అది అతడి బంధువు పేరిట తీసుకున్నదని వెల్లడయింది. శ్లోక్ త్రిపాఠి ఇదివరలో ఘాజియాబాద్ కోర్టులో పనిచేశాడు. ప్రస్తుతం అతడు మీరట్‌లో ఎల్‌ఎల్‌బి డిగ్రీ చేస్తున్నాడు. పోలీసుల కథనం ప్రకారం అతడు 2020లో వివాహం చేసుకున్నాడు. అతడి భార్య అతడికి దూరంగా ఢిల్లీలోని నరేలాలో వేరుగా ఉంటోంది. నిందితుడు ఆమెను వేధించేవాడని సమాచారం. అతడిని అరెస్టు చేశాక ఘాజీయాబాద్ పోలీసులు అతడిని ఢిల్లీ పోలీసులకు అప్పగించారు. వారు తమ కస్టడీలో అతడిని గట్టిగా విచారిస్తున్నారని సమాచారం.

# ఆ రెండు రాష్ట్రాలు బీజేపీ కల...లక్ష్యం పెద్దది !



న్యూఢిల్లీ,రాజకీయ పార్టీ అన్నాక పాలించాలని ఉంటుంది. అధికారం హస్తగతం చేసుకోవాలని ఉబలాటంగా ఉంటుంది. అంతే కాదు దేశమంతా తమ పార్టీ పతాకం ఎగరేయాలని కూడా ఉంటుంది. అయితే సాధ్యాసాధ్యాలు సమీకరణలు సవాళ్ళు ఇలా ఎన్నో ఉంటాయి. దేశంలో బీజేపీ ఆ రెండు రాష్ట్రాల మీద గురి పెట్టింది. కల కూడా సుదీర్ఘమైనది. నిజం చెప్పాలీ అంటే 2021లో బీజేపీ ఈ రెండు రాష్ట్రాలలో పాగా వేయాలని చూసింది. అయితే ఆ చాన్స్ మిస్ అయింది. అవే తమిళనాడు, పశ్చిమ బెంగాల్.తమిళనాడులో దిగ్గజ నేత కరుణానిధి మరణం ఒక వైపు మరో వైపు అన్నాడీఎంకే నేత జయలలిత అంతకు ముందే మృతి చెందడంతో ద్రవిడ పార్టీలలో నాయకత్వ సంక్షోభం ఉందని దాంతో తాము అన్నా డీఎంకేతో పొత్తుతో అధికారంలోకి రావచ్చు అని బీజేపీ కలలు కన్నది. కానీ కరుణానిధి అసలు సిసలు వారసుడిగా స్టాలిన్ నిలిచి బీజేపీకి గట్టి సవాల్ విసిరారు.దాంతో బీజేపీ అన్న డీఎంకే కూటమి ఎన్నికల్లో ఓటమి చెందింది. అలా తమిళ సీమలో బీజేపీ కలను మరో అయిదేళ్ళు వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఇక పశ్చిమ బెంగాల్ లో చూస్తే 2021 నాటికి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన మమతా బెనర్జీ మీద తీవ్రమైన ప్రజా వ్యతిరేకత ఉంటుందని బీజేపీ ఊహించి బోర్లా పడింది అయితే మూడు సీట్ల నుంచి 78 సీట్ల దాకా ఎగబాకడం బీజేపీకి భారీ ఊరటను ఇచ్చింది.ఇక 2021లో ఈ రెండు రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. దాంతో ఈసారి అయిన తమ కల నెరవేరక పోతుందా అన్నది బీజేపీ పెద్దల ఆరాటంగా ఉంది. అందుకే తరచూ అయితే పశ్చిమ బెంగాల్ లేకపోతే తమిళనాడులో వరస పర్యటనలు చేస్తున్నారు.తాజాగా తమిళనాడు పర్యటనలో ఉన్న బీజేపీ పెద్ద హెూం మంత్రి అయిన అమిత్ షా ఈసారి తమిళనాడు పశ్చిమ బెంగాల్ రెండూ ఎన్డీయే ఖాతాలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు 2026లో అటు మమత ఇటు స్టాలిన్ మాజీలు కావడం ఖాయమని కూడా ఆయన స్పష్టంగా చెబుతున్నారు. దాదాపుగా 6.80 లక్షల కోట్లు ఇచ్చినప్పటికీ కేంద్రం ఏమీ ఇవ్వలేదని చెప్పడం స్టాలిన్ కి అలవాటు అయిందని ఆయన విమర్శించారు.అయిదేళ్ల స్టాలిన్ పాలన పూర్తిగా ఫెయిల్ అయింది అని ఆయన విమర్శించారు. లా అండ్ ఆర్డర్ తమిళనాడులో గతి తప్పిందని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. పశ్చిమ కొంగు ప్రాంతం పరిధిలోని పలు గ్రామాల్లో వృద్ధుల టార్గెటెడ్ హత్యలను పోలీసులు ఆపలేకపోతున్నారని ఆయన ఆరోపించారు. ఈసారి డీఎంకేని గద్దె దించాలన్నదే బీజేపీ శ్రేణుల శపథం అని ఆయన అన్నారు. స్టాలిన్ ని దించే జోడీగా బీజేపీ అన్నా డీఎంకే ఉన్నాయని ఆయన దృఢ విశ్వాసం వ్యక్తం చేశారు. మొత్తానికి చూస్తే బీజేపీకి ఆ రాష్ట్రాలలో అధికారం ఒక కలగా ఉంది. లక్ష్యం చూస్తే భారీగా ఉంది. దాన్ని సాధించేందుకు బీజేపీ ఏ వ్యూహాలను అనుసరిస్తుంది అన్నదే ఇపుడు అందరికీ ఆసక్తిగా మారింది.

# జూబ్లీహిల్స్ 'ఉప ఎన్నిక..' ఏకగ్రీవం చేస్తారా? విష్ణునా..? అజహారా?



హైదరాబాద్,ఇప్పుడే అనుకోవడం కాదుకానీ.. తెలంగాణలో ప్రస్తుత శాసన సభ కొలువుదీరిన ఏడాదిన్నరలోనే రెండో ఉప ఎన్నిక అనివార్యం అయింది. 2024 ప్రారంభంలోనే కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య ప్రియ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో లోక్ సభ ఎన్నికలతో పాటు ఉప ఎన్నిక జరిగింది. బీఆర్ఎస్ సీటు కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లిపోయింది. మళ్లీ ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ నియోజకవర్గానికీ ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. సిటింగ్ ప్రజాప్రతినిధి మరణించిన నియోజకవర్గంలో ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఈ ఏడాది చివర్లో జరిగే బిహార్ ఎన్నికలతో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగుతుందని భావించాలి.ఒకప్పటి ఖైరతాబాద్ నియోజకవర్గంలో భాగమైన జూబ్లీహిల్స్ ప్రాంతం పునర్విభజన అనంతరం 2009లో నియోజకవర్గంగా ఏర్పడింది. తొలుత ఎమ్మెల్యేగా దివంగత పి.జనార్దన్ రెడ్డి (పీజేఆర్) కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి కాంగ్రెస్ తరఫున గెలుపొందారు. అయితే, 2014 నుంచి మాగంటి గోపీనాథ్ హవా నడిచింది. 2018, 2023లో బీఆర్ఎస్ నుంచి ఆయన విజయం సాధించారు.వాస్తవానికి విష్ణు గత ఎన్నికల ముందు టికెట్ దక్కకపోవడంతో బీఆర్ఎస్ లోకి వెళ్లారు. అప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్ పోటీ చేసి మాగంటి చేతిలో పరాజయం పాలయ్యారు. 2014లో మూడో స్థానంలో నిలిచిన విష్ణు.. 2018లో 68 వేలకుపైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2023లో అజహర్ కు టికెట్ ఇస్తే ఆయన 80 వేల ఓట్ల తేడాతో పరాజయం చవిచూశారు.అవన్నీ వదిలేస్తే ఇప్పుడు ఉప ఎన్నిక వస్తే బీఆర్ఎస్ అభ్యర్థిగా విష్ణును నిలుపుతారా? లేక మాగంటి కుటుంబ సభ్యులకు టికెట్ ఇస్తారా? అనేది చూడాలి. కాంగ్రెస్ నుంచి అజహర్ మళ్లీ పోటీకి దిగుతురా? అనేది కూడా ఆసక్తికరం. ఒకవేళ అధికార పార్టీ కావడం, దశాబ్దాల అనుబంధం, బలమైన అభ్యర్థి అయిన నేపథ్యంలో విష్ణువర్ధన్ రెడ్డిని కాంగ్రెస్ లోకి తీసుకుని టికెట్ ఇస్తారా? బీఆర్ఎస్ నుంచి విష్ణు బయటకు వస్తారా? అనేది చూడాలి.కాగా, 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత రెండు ఉప ఎన్నికలూ హైదరాబాద్ పరిధిలోనివే అవుతున్నాయి. వాస్తవానికి సిటింగ్ ఎమ్మెల్యే చనిపోతే.. ఆ ఉప ఎన్నికను ఏకగ్రీవం చేసే సంప్రదాయాన్ని ఉమ్మడి రాష్ట్రంలో పాటించారు. ఇప్పుడు అది లేదు. ఎందుకంటే తెలంగాణలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దుర్మరణం పాలయినా పోటీ జరిగింది. అంటే.. జూబ్లీహిల్స్ కూ ఉప ఎన్నిక ఖాయం అనుకోవాలి.

# రాజకీయ సంకల్పంతోనే పోలీస్ సంస్కరణలు సాధ్యం



అమరావతి,ప్రజలు చైతన్యంతో ఉద్యమించి ,ఎన్నికల మానిఫెస్టోలో పోలీస్ సంస్కరణలు ప్రాధాన్యత అంశంగా పెట్టించి తద్వారా రాజకీయ సంకల్పాన్ని కలిగిస్తేనే భారతదేశంలో పోలీస్ సంస్కరణలు అమలై చట్టబద్ధ పాలన సాధ్యం అవుతుందని విశ్రాంత ఐపిఎస్ అధికారి ఏబి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 8వ తేదీ గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో పోలీస్ సంస్కరణలపై జరిగిన చర్చా గోష్టికి ముఖ్యఅతిథిగా హాజరై ఏబి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. నేడు జైళ్ళలో మగ్గుతున్న లక్షలాది మందిలో 85 శాతం పైగా విచారణ ఖైదీలుగా పేద వర్గాలే ఉన్నారని తెలిపారు. న్యాయస్థానాలను రెట్టింపు చేయడం ద్వారా న్యాయాన్ని అందరికీ అందించగలమని తద్వారా థర్డ్ డిగ్రీ ప్రయోగించకుండానే, నేర నిరూపణతో నేరాలను తగ్గించవచ్చునన్నారు. పోలీసులలో నైపుణ్యాలను పెంచి ఆధునిక సాంకేతిక పరిణామాన్ని అందించడం, నేర పరిశోధనను, నేర విచారణ నుండి వేరుచేస్తేనే సత్వర న్యాయం సాధ్యమన్నారు. మనతోపాటు బ్రిటన్ నుండి విముక్తి పొందిన సింగపూర్ న్యాయవ్యవస్థ, పోలీస్ వ్యవస్థల్లో అగ్ర భాగాన ఉందని, ఇది రాజకీయ సంకల్పం ద్వారానే సాధ్యమైందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అన్ని రకాల దుర్మార్గాలపై న్యాయ విచారణ జరిపి, సంబంధిత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల తెనాలిలో ముగ్గురు యువకులను ప్రజల మధ్య బహిరంగంగా చావ బాది ,ఆ వీడియోను ఉద్దేశ్య పూర్వకంగా ప్రజల ముందు ఉంచి, ప్రజల్లో భయాందోళనలు కలిగించడానికి ప్రయత్నించడం అమానుషమని పేర్కొని, సంబంధిత పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి అదనపు వ్యయం లేకుండానే దృఢమైన రాజకీయ సంకల్పం, చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుతమున్న సిబ్బంది, వనరులతోనే 75 శాతం మేర సంస్కరణలు తీసుకొని రావచ్చన్నారు. 2.5 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్ ఒకవైపు ఉంటే, మరోవైపు పోలీస్ వ్యవస్థలో మార్పుల కోసం, పేదలకు సత్వర న్యాయం కల్పించడానికి అదనంగా కనీసం 1000 కోట్ల వెచ్చించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం శోచనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ లో పోలీస్ యంత్రాంగం అధికార పార్టీకి ప్రైవేట్ ఆర్మీగా మారిందన్నారు. అధికార పార్టీ నేతల కను సన్నలలో క్షేత్రస్థాయిలో పోలీసులు వ్యవహరిస్తున్నారని, దీని వలన చట్టబద్ధ పాలనకు భంగం వాటిల్లుతుందన్నారు. తెనాలి సంఘటనతో బాధ్యులైన పోలీస్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. మాజీ శాసన మండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ సామాన్యులు పోలీస్ స్టేషన్ కు వెళ్లి వారి సమస్యలను వివ రించడానికి భయపడే వాతావరణం నేడు ఉందని, ఫ్రెండ్లీ పోలీస్ రావాలని కోరారు. ప్రముఖ విద్యావేత్త ప్రో. డి. ఏ. ఆర్. సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ లక్షలాది మంది అభ్యర్థులు పోటీ పడితే కేవలం వందల సంఖ్యలో ఐఏఎస్, ఐపీఎస్ లుగా విజయం సాధిస్తున్నారని, వీళ్లు కూడా అధికార పార్టీకి దాసోహం కావడం వలన ప్రజాస్వామ్యం ఎలా వికసిస్తుందని ప్రశ్నించారు.

# పవన్ ని ఇరుకున పెడుతున్న వర్మ !



అమరావతి,పవన్ అంటే క్లీన్ ఇమేజ్ కోసం తపించే నాయకుడు. ఆయన రాజకీయాల్లో అవినీతి లేకుండా చూడాలని నినాదాలు ఇస్తూ ఉంటారు. అంతే కాదు ఆయన వైసీపీ మీద అవినీతి అక్రమాలు అంటూ ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒక రేంజిలో తీవ్ర విమర్శలు చేస్తూ వచ్చేవారు. అటువంటిది ఆయన చేతుల్లోకి అధికారం వచ్చింది. ఆయన ఎమ్మెల్యే అయ్యారు. అంతే కాదు ఉప ముఖ్యమంత్రి హెూదా కూడా దక్కింది.ఇక ఏపీలోనే పిఠాపురాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని జనసేన నేతలు ప్రకటించుకున్నారు. ఒక ఏడాది గడచింది. దాంతో టీడీపీ కూటమి పరిపాలన ఎలా ఉందో అన్నది చాలా మంది సర్వేలు చేస్తున్నారు. ఇంకో వైపు చూస్తే కనుక పిఠాపురంలో పవన్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా పనితీరు మీద కూడా సహజంగానే ఆసక్తి ఉంటుంది.సరిగ్గా ఈ సమయంలోనే పిఠాపురం టీడీపీ ఇంచార్జి అయిన ఎస్వీఎస్ఎన్ వర్మ అయితే బాహాటంగా కొన్ని విషయాలు చెప్పారు. ఆయన విమర్శించే ధోరణిలో కాకుండా చాలా లౌక్యంగానే చెప్పాల్సింది చెప్పేశారు. పిఠాపురంలో పెద్ద ఎత్తున ఇసుక దందా జరుగుతోందని వర్మ స్పష్టంగానే చెప్పేసారు. ఇది నిజానికి ఏ విపక్ష నాయకుడో చేయాల్సిన ఆరోపణ.పిఠాపురంలో చూస్తే వైసీపీ ఎక్కడ ఉందో ఎవరికీ తెలియని పరిస్థితి. దాంతో కూటమిలోనే లుకలుకలతో విపక్షం రోల్ కూడా పోషిస్తున్నట్లుగా ఉంది. ఇక వర్మ విషయం తీసుకుంటే ఆయన సీనియర్ మోస్ట్ లీడర్. ఆయనకు ఏమి మాట్లాడాలో ఏమి అనకూడదో బాగా అనుభవం ఉంది. అలాంటి నేత పిఠాపురంలో ఇసుక దందా సాగుతోంది అని చేసిన ఆరోపణలను తేలిగ్గా ఎవరూ తీసుకోలేరు అని అంటున్నారు.అంతే కాదు పేదలకు ఇసుక దొరకడం లేదు. పెద్దలు టన్నులు టన్నులు తరలించుకుని పోతున్నారు అని హాట్ కామెంట్స్ చేశారు. దాంతో వర్మ కావాలని చేశారా లేక నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఒక మాజీ ఎమ్మెల్యేగా బాధ్యతాయుతమైన నాయకుడిగా ప్రస్తావించారా అన్న చర్చ సాగుతోంది.ఆయన ఏ ఉద్దేశ్యంలో చేసినా కూడా అది నేరుగా పవన్ కళ్యాణ్ కే తగిలింది అని అంటున్నారు. పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గంలో సీన్ ఈ విధంగా ఉంటే మిగిలిన చోట్ల ఎలా ఉంటుందో అన్నది కూడా అందరికీ చర్చగా ఉంది.మరో వైపు చూస్తే పవన్ ఉప ముఖ్యమంత్రిగా సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉంటూ ఈ దందాను అరికట్టలేకపోతున్నారా అన్న కొత్త చర్చకు కూడా వర్మ చేసిన కామెంట్స్ దారి తీస్తున్నాయని అంటున్నారు. ఇక వర్మకు టీడీపీలో బలమైన బంధం ఉంది. ఆయన పాతికేళ్ళ రాజకీయం చేస్తూ వస్తున్నారు. పిఠాపురం జనసేన అడ్డా అని ఆ పార్టీ నాయకులు ఈ మధ్య కాలంలోనే గట్టిగా సౌండ్ చేస్తూ వచ్చారు.ఇపుడు వర్మ వంతు అన్నట్లుగా ఆయన ఒక్కసారిగా బిగ్ సౌండ్ చేశారు అది అటూ ఇటూ తిరిగి ఇపుడు ఏకంగా పవన్ కళ్యాణ్ కే తగిలేలా ఉందని అంటున్నారు. మొత్తానికి చూస్తే వర్మ వ్యాఖ్యలు పవన్ ని ఇరుకున పెట్టేలా ఉన్నాయని అంటున్నారు. దీని మీద జనసేన నుండి ఏ రకమైన కౌంటర్ వస్తుందో చూడాలని అంటున్నారు.

# ఉన్నవి ఆరు ఖాళీలు.. 18 నెలల తర్వాత సగం భర్తీ !



హైదరాబాద్,కాబోయే హెూం మంత్రి నేనే అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాలుగు సార్లు.. ఎమ్మెల్యే డెఫినెట్ గా బెర్త్ కన్ ఫర్మ్ అంటూ సుదర్శన్ రెడ్డి, ఆదిలాబాద్ మారుమూల నుంచొచ్చా.. కేబినెట్ లో సీటు ఖాయం అంటూ ప్రేమ్ సాగర్ రావ్, ఉమ్మడి రంగా రెడ్డికి పదవిలేదని మల్ రెడ్డి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ ఆశావహుల ఆశలన్నీ ఆశలుగానే.. కలలు కల్లలుగానే.. మిగిలాయ్! ఇక ఎమ్మెల్సీలు దయాకర్ రావు, విజయశాంతి.. సంగతి సరేసరి. కట్ చేస్తే వివేక్, వాకిట, అడ్లూరితో భర్తీకి ఫుల్ స్టాప్ పెట్టకుండా, కామా పెట్టడంలో అర్థమేంటన్నది ఇప్పుడందరినీ తొలిచేస్తోన్న ప్రశ్న. అందరిలోకీ ఒకింత ఆశ్చర్యకరమైన ఎన్నిక వివేక్ దే. ఒక పక్క దళిత సంపన్న నేత. మరొక పక్క మీడియా అధినేత. అన్నింటికన్నా మించి బీజేపీ నుంచి వచ్చినా మేనేజ్ చేయగలిగిన సత్తా. ఇటు కుమారుడు వంశీ చూస్తే మొన్నటి పుష్కరాలపుడు యాంటీ గవర్నమెంట్ యాగీ. అయినా సరే.. బెర్త్ కొట్టడమంటే మామూలు విషయం కాదు. అంతా తావీజ్ మహిమ! అంటున్నారు కొందరు. ఇక వాకిట శ్రీహరి మహబూబ్ నగర్ వాసి. సీఎం కూడా సేమ్ జిల్లా. దీంతో వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించినట్టు భోగట్టా. ఇదిలా ఉంచితే అడ్లూరి. కవ్వంపల్లిని ఊరించి ఊరించి లాస్ట్ కి అడ్లూరి నోట్లో లడ్డూ పెట్టింది అధిష్టానం. అదేమంటే ఎప్పటి నుంచో లాయల్ కదా? అంటున్నారు. ఇప్పుడు వీరి సంగతి కాదు కానీ.. రాజగోపాల్, ప్రేమ్ సాగర్, సుదర్శన్.. వీరి పయనమెటు? ఆల్రెడీ హెూంత్రి ఖాయం అంటూ తన అనుచరులకు, కార్యకర్తలకు చెప్పుకు తిరిగిన కోమటిరెడ్డి బ్రదర్. అంతేనా.. చామలను బోన్ గిరి ఎంపీగా గెలిపిస్తే.. నీకు మంత్రిత్వం ఖాయమంటూ సీఎం నుంచే హామీ ఉన్నా ఏం ఫాయిదా? దీంతో చిలుకూరు ఫామ్ హౌస్ లో అలకపాన్పు ఎక్కారు. ఇక ప్రేమ్ సాగర్ రావు.. ఎక్కడో మారు మూలండీ బాబూ.. ఒక్కటంటే ఒక్క మంత్రి పదవి లేకుంటే ఎట్టా? అన్నదాయన ఆవేదన. సుదర్శన్ రెడ్డి ఉమ్మడి నిజామాబాద్ అంటే మరీ అంత లోకువా అంటున్నారు.ఇక మైనార్టీల నుంచి మంత్రి లేకనే పోయె. ఇప్పటి వరకూ మంత్రివర్గంలో పాటించిన సామాజిక న్యాయమేపాటి? అని చూస్తే.. రెడ్లు- 4, బీసీలు-3, ఎస్సీ మాల-3, ఎస్సీ మాదిగ-2, ఎస్టీ కోయ-1, ఎస్టీ లంబాడ-1, బ్రాహ్మణ-1, కమ్మ- 1, వెలమ-1 గా ఉంది. ఇదీ కాంగ్రెస్ మార్క్.. సామాజిక న్యాయం కథ, కమామిషు. మొన్నంటే మొన్న మాదిగలంతా కలసి.. ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను, పీసీసీ చీఫ్మహేష్ ని వర్గీకరణ చైర్మన్ ఉత్తమ్ ని కలిసి మొరపెట్టుకున్నందుకు అడ్లూరి రూపంలో ఒక పదవైతే దక్కింది. డిప్యూటీ స్పీకర్ గా రామచంద్రు నాయక్ కూడా హ్యాపీయే. మిగిలిన సామాజిక వర్గాల్లో అసంతృప్తులు అధికంగా ఎవరున్నారయా అంటే వాళ్లలో కూడా రెడ్లే ఎక్కువ.అయితే ఈ మూడింటిని భర్తీ చేసే మూడ్ ఎప్పుడన్నది ఒక హాట్ టాపిక్. ఎంతైనా ఇది కాంగ్రెస్ పార్టీ బాసూ.. ఆ మాత్రం వెయిటింగ్ తప్పదు. ఇచ్చిన వాళ్లతోనే కాదు ఇవ్వని వాళ్లను కూడా వాడుకుని ఎలాగోలా నెగ్గుకు రావల్సి ఉంటుంది. అవునుగానీ ఇంతకీ ఈ మూడు మిగుల్చుడు-నాన్చుడు స్ట్రాటజీ ఎవరిదన్నది ఇప్పుడు తెరపైకి వచ్చిన మరో కొత్త చర్చ. అయితే ఇదంతా మీనాక్షి దేవి మహిమగా భావన. కారణమేంటంటే.. మీరేం ఖంగారు పడకండి ఖర్గేగారూ! నాదగ్గరో ఫార్ములా ఉందని తొలుత మీనాక్షి నటరాజనే కామెంట్ చేశారట. ఇదెలాగంటే.. విస్తరణకంటూ ఒక ఫుల్ స్టాప్ పెట్టేస్తే.. కొందరి అసంతృప్తుల నుంచి వచ్చే జ్వాల రాబోయే స్థానిక ఎన్నికలను తగలబెట్టినా పెట్టేస్తుంది. మొన్నటి ఎమ్మెల్సీ ఫలితాలు చూశాంగా. దీన్ని దృష్టిలో పెట్టుకున్న మీనాక్షమ్మ.. సగమిచ్చి సగం వదులుదాం. ఎందుకంటే మన దగ్గరున్నవే ఆరు. వాటిలో ఆరింటికి ఆరిచ్చేసినా.. అరవై ముంది ఆశావహుల్లో ఆ అసంతృప్తిని ఎలాగూ చల్లార్చలేం. అదే సగం ఇచ్చి సగం దాచాం అనుకోండి. ఆ సగంలోని మూడింటి కోసం రేపటి పార్టీ కార్యక్రమాలు కావచ్చు, స్థానిక ఎన్నికలు కావచ్చు.. ముప్పై మంది వరకూ కష్టపడతారు. మేం ఇంత కష్టపడ్డాం కాబట్టి మాకూ మంత్రి పదవి ఇవ్వమని అడగటానికి బాగుంటుంది. కాబట్టి ఇదే కరెక్ట్ అనుకుంటారని.. మీనాక్షి వేసిన నటరాజ్ మార్క్ స్కెచ్ గా దీన్ని అభివర్ణిస్తున్నారు. మరి చూడాలి.. ఈ అసంతృప్త నేతలలో మీనాక్షమ్మ బుజ్జగింపులకు ఎంత మంది తలొగ్గుతారో. మిగిలిన ఆశావహులు ఈ స్ట్రాటజీకి లోబడి ఎంతగా పని చేస్తారో తేలాల్సి ఉంది. ఏది ఏమైనా ఇది కాంగ్రెస్ గురూ! సముద్రం. ఈ సముద్రంలో ఎన్ని పదవుల పన్నీరు పోసినా.. ఆ సముద్ర ఉప్పు అంత తేలిగ్గా తగ్గేది కాదన్నది ఫైనల్ టాక్. ఏమంటారు!

# ముందే కూస్తున్న సర్వే కోయిలలు!



అమరావతి,ఎవరి పని వాళ్లది. అందుకే కావచ్చు. సమయంతో, సందర్భంతో పని లేదు అన్నట్లుగా సర్వే కోయిలలు కూసేస్తున్నాయి. ఏడాది కాలానికే ఇలా అలా అంటూ చెబుతున్నాయి. నిజానికి వీటిని ఏ రాజకీయ పార్టీ కూడా సీరియస్ గా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఎన్నికలు ఏడాది దూరంలో వున్నాయి అన్నపుడు జనం మూడ్ ఎలా వుంటుందో అదే ఎన్నికల ఫలితాన్ని డిసైడ్ చేస్తుంది. జనం మూడ్ ఎప్పటికప్పుడు మారిపోతూ వుంటుంది.2019 నుంచి 2023 వరకు చూస్తే జగన్ కు ఇక తిరుగులేదు అనుకున్నారంతా, మొత్తం గేమ్ మారిపోయింది 2024 ఎన్నికలకు ఏడాది ముందే. అంతెందుకు తెలంగాణలో కొన్ని నెలల క్రితం వరకు బీఆర్ఎస్ వచ్చేస్తోంది అనిపించేసింది అందరికీ. కానీ గత కొన్ని నెల్లల్లో పరిస్థితి న్యూట్రల్ అయిపోయింది. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ రెండూ ఒకే రేంజ్ లో వున్నాయి.మరి ఎందుకీ ఎన్నికల సర్వేలు అంటే.. ఏదో ఒకటి చేయాలి కదా..ఈ సర్వేలు పట్టుకుని వార్తలు రాసుకోవడం మీడియా పని. ఆంధ్రలో జనసేన ఎమ్మెల్యేలు 15 మంది వరకు గెలవరు అన్నది లేటెస్ట్ సర్వే. ఇలా చెప్పడం వల్ల వాళ్లకి మంచితే. కాస్త వళ్లు వంచుతారు. జనాల్లో తిరుగుతారు. కానీ ఇక్కడ ఓ చిక్కు వుంది. 2029 నాటికి ఏ సీటు ఎవరికి వుంటుందో తెలియదు. కూటమిలో ఎవరు ఏ ప్లేస్ పంచుకుంటారో తెలియదు. జనసేన, భాజపాలకు ఆప్షన్లు తక్కువ. తెలుగుదేశం పార్టీది డిసైడ్ ప్లేస్.అందువల్ల మరీ కష్టపడిపోయినా లాభం లేదు. తెలుగుదేశం గుడ్ లుక్స్ లో వుండాలి. జనసేన, భాజపా జనాలు కూడా. అప్పుడు పని జరుగుతుంది. ఇప్పుడు పథకాలు ఇవ్వలేదనో, రెడ్ బుక్ అనో, మరోటి అనో జనాల్లో అసంతృప్తి వున్నా సమస్య ఏమీ లేదు. ఎందుకంటే గతంలో నాలుగేళు సమస్యగా వున్నా ఒక్క ఏడాదిలో తనవైపు తిప్పుకున్నారు చంద్రబాబు. పైగా అప్పుడు అధికారంలో లేరు. ఇప్పుడు అధికారంలో వున్నారు. అన్నింటికి మించి జనానికి షార్ట్ టెర్మ్ మెమరీ లాస్. జగన్ ఇచ్చినవన్నీ ఆఖరి ఏడాదిలో మరిచిపోయారు. అలాగే ఈ తొలి ఏడాది సమస్యలు మలి ఏడాది గుర్తుండవు.అందువల్ల సర్వేలు సరదాగా వార్తలు రాసుకోవడానికి పనికి వస్తాయి తప్ప, సీరియస్ గా తీసుకోవడానికి అయితే కాదు.

# లాస్ ఏంజెలెస్‌లో కొనసాగుతున్న ఆందోళనలు..



లాస్ ఏంజెలెస్ :అక్రమ వలసదారుల ఏరివేతలో భాగంగా ఫెడరల్ అధికారులు చేపట్టిన దాడులతో లాస్ ఏంజెలెస్ అట్టుడుకుతోంది. శుక్రవారం లాస్ ఏంజెలెస్‌లో ఫెడరల్ అధికారులు జరిపిన దాడులతో నగరమంతా అట్టుడికిన సంగతి తెలిసిందే. ఫెడరల్ అధికారులకు స్థానికుల నుంచి తీవ్రస్థాయిలో ప్రతిఘటన ఎదురవుతున్నది. ఆందోళన కారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయుగోళాలు, పెప్పర్ స్ప్రే ప్రయోగించారు. దీంతో పోలీసులపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. ఈ క్రమంలో నేషనల్ గార్డ్స్ దళాలకు చెందిన 2 వేల మందిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దింపారు.ట్రంప్ చర్యకు వ్యతిరేకంగా ఆదివారం లాస్ ఏంజెలెస్‌లో వేలాది మంది నిరసనకారులు వీధుల్లోకి వచ్చి నిరసన చేపట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. నిరసనకారులను కట్టడి చేసేందుకు అధికారులు టియర్ గ్యాస్, రబ్బరు బుల్లెట్లు, ఫ్లాష్ బ్యాంగ్‌లను ప్రయోగించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిరసన కారులు మరింత రెచ్చిపోయారు. ట్రంప్ ప్రభుత్వం, స్థానిక అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వాహనాలకు నిప్పు పెట్టారు . నిరసన కారుల చర్యతో నడిరోడ్లపై అనే కార్లు దగ్ధమయ్యాయి. ప్రస్తుతం లాస్ ఏంజెలెస్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. మరోవైపు నిరసనకారులను అధికారులు ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తున్నారు.లాస్ ఏంజెలెస్‌లోని పారమౌంట్ సిటీలో వలసదారులు అధికంగా ఉండే ప్రాంతాల్లో కొన్ని రోజులుగా ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**